నేటినిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433
E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 30-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:198 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

లెక్కలు రావు
శూన్యం చుట్టు భ్రమణం
కొంగ చేపలు.

ఇంధన రణం
విశ్వం హాహాకారాలు
ప్రగతి శూన్యం.

కట్టెల పొయ్యి
ఇంధనాలు కరవు
వంట కష్టాలు.

సాహిత్య కొల్లు
కొంగల ఆదిపత్యం
హంసల గోల.

వంశ వంగడం
రాజకీయ సుక్షేత్రం
ఆగని సాగు.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ఆరుగాలం కష్టపడి
అంగట్లో ఆగమాగం !
ఆరబోసి వడ్ల మీదె
ముంగిట్లో ప్రాణత్యాగం !
దుక్కి దున్ని పంట తెస్తె
అమ్మేందుకు హక్కు లేద ?
దొరలు మీరె ధరలు మీవె
కొనేందుకు దిక్కు లేదా ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# పదో తరగతి ఫలితాల్లో 95.15 శాతం ఉత్తీర్ణత నమోదు



హైదరాబాద్, ఏప్రిల్ 29:తెలంగాణలో పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కేశవరావు ఇవాళ అధికారికంగా ఫలితాలను ప్రకటించారు. ఈ ఏడాది మొత్తం 95.15 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం విశేషం.

ఈసారి మొత్తం 4,97,312 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురుచూసిన ఫలితాలు విడుదల కావడంతో పాఠశాలల వద్ద సందడి నెలకొంది.

మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు లక్షలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. మూల్యాంకన ప్రక్రియ పూర్తైన అనంతరం ప్రభుత్వం ఫలితాలను విడుదల చేసింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం మెరుగ్గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాల వారీగా, బాలురు-బాలికల ఫలితాల వివరాలను కూడా త్వరలో వెల్లడించనున్నారు.

## తెలంగాణలో ఉద్యోగులకు రూ.1000 కోట్ల బకాయిల విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 29: తెలంగాణలో ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. బుధవారం ఆర్థికశాఖ రూ.1000 కోట్లను రిలీజ్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను సర్కార్ చెల్లించింది. దీంతో 2025 అక్టోబర్ వరకు బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసింది. గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ప్రతి నెల ఉద్యోగుల బకాయిల కోసం ప్రభుత్వం రూ.700 కోట్ల చెప్పున చెల్లిస్తూ వస్తోంది. ఈనెల బకాయిల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచింది. మిగిలిన ఉద్యోగులకు సంబంధించి త్వరలోనే నెలకు వెయ్యి కోట్ల చెప్పున విడుదల చేస్తూ బకాయి లన్నింటీని క్లియర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఉద్యోగుల మెడికల్ బిల్లులను కూడా ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా ప్రభుత్వం చెల్లిస్తోంది.

# మే 4న ఐదు రాష్ట్రాల్లో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తాం: మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, గత ఎన్నికల తరహాలో కాకుండా ఎలాంటి భయాలు లేని వాతావరణంలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రజాస్వామ్య పటిష్టతకు ఇది సంకేతమని తెలిపారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రజలంతా ఉత్సాహంతో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మే 4న ఐదు రాష్ట్రాలలో బీజేపీ గెలిచి హాట్రిక్ సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హార్దోయిలో 'గంగా ఎక్స్‌ప్రెస్‌వే'ను ప్రధాని బుధవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బెంగాల్‌లో జరుగుతున్న పోలింగ్‌ను ప్రస్తావించారు.

'బెంగాల్‌లో ప్రస్తుతం రెండో విడత పోలింగ్ జరుగుతోంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నట్టు తెలుస్తోంది. మొదటి విడతలో మాదిరిగానే ప్రజలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. గత ఆరేడు దశాబ్దాల్లో ఎవరూ ఊహించని విధంగా భయరహిత వాతావరణంలో ఓటింగ్ జరుగుతోంది. ఓటింగ్ ముగియడానికి మరికొద్ది గంటలే ఉన్నాయి. ప్రజలు ఇదే ఉత్సాహంతో ప్రజాస్వామ్య పండుగలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతున్నాను' అని మోదీ అన్నారు.

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీజేపీ ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ సాధించనుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఫలితాలతో అభివృద్ధి భారత్ సంకల్పానికి మరింత బలం చేకూరనుందని చెప్పారు.

## మళ్లీ నిలిచిన మంజీరా జలాల తరలింపు

**-గాలి దుమారంతో విద్యుత్ అంతరాయం**
**-పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు**

హైదరాబాద్, ఏప్రిల్ 29: నగరానికి మంజీరా జలాలు మళ్లీ నిలిచిపోయాయి. కృష్ణా, గోదావరి జలాల మాదిరిగా నిరాటంకంగా నగరానికి నీళ్లు సరఫరా కావడం లేదు. వాతావరణ మార్పులతో ఇటీవల గాలిదుమారం, వడగళ్ల వాన కురుస్తుండగా విద్యుత్ అంతరాయం తలెత్తుతోంది. ఎన్నో ఏళ్ల నాటి విద్యుత్ వ్యవస్థ కావడంతో చెట్ల కొమ్మలు తగిలినా నగరానికి మంజీరా నీటిని పంపింగ్ చేసే మోటర్లకు విద్యుత్ సరఫరా కావడం లేదు. మంగళవారం సాయంత్రం భారీగా వీచిన గాలులకు మంజీరా పంపింగ్ స్టేషన్‌కు విద్యుత్ అంతరాయం తలెత్తడం వల్ల నీటి తరలింపు నిలిచిపోయింది.

దీంతో నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కానీ గాలులు వీస్తుండగా పంపింగ్ స్టేషన్లలోని మోటార్లపై ప్రభావం పడే అవకాశం ఉండడంతో అర్ధరాత్రి వరకు నగరానికి నీటి సరఫరా నిలిపివేశారు.

నాలుగు రోజుల్లో మూడుసార్లు మంజీరా జలాల తరలింపు నిలిచిపోయింది. పంపింగ్ ప్రారంభమై నగరానికి నీరు సరఫరా చేయడానికి ఆరేడు గంటల సమయం పడుతుండడంతో పలు ప్రాంతాలకు సమృద్ధిగా సరఫరా కాకపోగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధానంగా రామచంద్రాపురం, బీహెచ్ఈఎల్, చందానగర్, మియాపూర్, కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్ పరిసర ప్రాంతాలకు లోప్రెషర్‌తో, కొన్నిసార్లు తాత్కాలిక అంతరాయం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

# ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే: మహేశ్ కుమార్



నిజామాబాద్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేశ్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేశ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కేసీఆర్ పాలన తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని మహేశ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పోటీ లేదన్నారు. మంచి నమూనాతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందని.. ఏడాది కాలంలో 4 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదు.. నేను అడగలేదు: కోదండరాం

హైదరాబాద్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీ తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పలేదని.. తాను అడగలేదని ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మేము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అడుగుతున్నాం. ఈసారి మా పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. 'గత ప్రభుత్వంలో ఎవరినైనా కలవాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఇంట్లోనే ఫోన్ పెట్టి, జాగ్రత్తగా రమ్మని చెప్పే వాళ్లు. భయం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించింది' అని విమర్శించారు.

అమరుల స్ఫూర్తి యాత్రకు కూడా పర్మిషన్ ఇవ్వలేదని కోదండరాం గుర్తు చేశారు. ప్రజల నుంచి దూరంగా ఉంటే ఏ పార్టీ అయినా బతకదని, అందుకే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని అన్నారు. 'మేం సరిగ్గానే ఉన్నాం. ప్రజలే మారాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. కుటుంబ లోపాలను కవిత బయటపెడుతున్నారని అన్నారు. పార్టీ అంటే కుటుంబమే అని కవిత చెప్పకుండానే చెబుతున్నట్లు ఉందని అన్నారు. ఓట్లు, సీట్లు కావాలంటే పార్టీని వేరేలా నడపాలని.. తాము మార్పు కోసమే పార్టీని నడుపుతున్నామని స్పష్టం చేశారు. అన్ని ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా ఉండలేమని, ఈసారి కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ముందు నుంచే నియోజక వర్గాలను ఎంచుకుని పని చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు కోదండరాం తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, ఏప్రిల్ 29: వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్య సేవలు పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌కు చెందిన కోన భాస్కర్‌రావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.75 లక్షల రూపాయల ఆర్థిక మంజూరు పత్రాన్ని అందజేశారు.

భాస్కర్‌రావు కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధ పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన చికిత్స చేయించుకోలేక పోతున్నామని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సహాయం కోరారు. ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం పత్రాన్ని భాస్కర్‌రావు కుమారుడు సాయి ప్రశాంత్‌కు అందజేశారు.

## టీఆర్ఎస్ పేరుపైనే కవిత పార్టీ పెట్టడం హాస్యాస్పదం: కోమటిరెడ్డి

యాదాద్రి, ఏప్రిల్ 29: టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవితపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కవిత పార్టీ పెట్టడం.. అది కూడా టీఆర్ఎస్ పేరు మీదనే పార్టీ పెట్టడం హాస్యాస్పదమన్నారు. కూతురికి తండ్రి అంటే ప్రేమ ఉండాలని.. కానీ కవిత తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టి మర్యాద పోగొట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్‌ను తిట్టడం తనకు బాధేసిందని తెలిపారు. కన్న తండ్రికే విలువ ఇవ్వని మనిషి.. ప్రజలకు 'అమ్మ' ఎలా అవుతుందని ప్రశ్నించారు. తన అన్న మీద ఉన్న కోపాన్ని తండ్రి మీద చూపడం తప్పన్నారు. మద్యం కుంభకోణంలో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని.. కేసు పూర్తి కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టేంత సులువైందన్నారు.

మంత్రి పదవిపై ...

మంత్రి పదవిపై అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని... మాట నిలబెట్టుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలిపారు. మంత్రి పదవి ఇస్తే మరింత కష్టపడి పనిచేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## ఘజియాబాద్‌లోని 'గౌర్ గ్రీన్'లో భారీ అగ్నిప్రమాదం.. పరుగులు తీసిన జనం

ఉత్తర్ ప్రదేశ్ ఏప్రిల్ 29: ఘజియాబాద్‌లోని ఇందిరాపురం గౌర్ గ్రీన్ అవెన్యూ హౌసింగ్ సొసైటీలోని ఓ ఫ్లాట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీగా ఎగసిపడిన మంటలు పక్క ఫ్లాట్లకు కూడా విస్తరించాయి. దీంతో భయాందోళనకు గురైన నివాసితులు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తమ తమ ఫ్లాట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మూడు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు.

ఈ ప్రమాదంలో భారీగానే ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. అధికారులకు ఫోన్ చేసి ప్రమాదంపై ఆరా తీశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# సమాజాన్ని సంస్కరించేది కవి మాత్రమే

**- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ నందిని సిధారెడ్డి**



పుస్తకావిష్కరణలో అతిథులు.

హైదరాబాద్, ఏప్రిల్ 29:సమాజాన్ని సంస్కరించడమే కవి పని అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. నందిని సిధారెడ్డి అన్నారు. పాలమూరు సాహితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 న మహబూబ్ నగర్ నగరంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ లోని కాళోజీ హాల్ లో ప్రముఖ కవి, విద్యావేత్త కె.లక్ష్మణ్ గౌడ్ రచించిన " నిశ్శబ్దం మాట్లాడితే..." కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా, ఆవిష్కర్తగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మణ్ గౌడ్ స్థానిక సమస్యలనే కాకుండా అంతర్జాతీయ సమస్యలను సైతం అద్భుతంగా కవిత్వం రాశాడన్నారు. కవి నిరంతరం సమాజంతో మాట్లాడుతూనే చిత్రిక పట్టాలన్నారు. ధిక్కారంతో రాసిన కవిత్వం ఇందులో కనిపిస్తుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎస్.రఘు మాట్లాడుతూ లక్ష్మణ్ గౌడ్ కవిత్వం సమకాలీన సమస్యలను బలంగా ఆవిష్కరించిందన్నారు. నిరంతరం కవిత్వం రాస్తూ సమాజాన్ని తట్టిలేపే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. పుస్తక సమీక్షకులు, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, మూడు వరల్డ్ రికార్డుల విజేత డా. వంగీపురం శ్రీనాథాచారి మాట్లాడుతూ ప్రపంచ కవులైన ఇలియట్, జాన్ కీట్స్, ప్లాబో నెరుడా వంటి వారు రాసిన కవిత్వం లక్ష్మణ్ గౌడ్ కవిత్వంలో కనిపిస్తుందన్నారు. లక్ష్మణ్ గౌడ్ కవిత్వంలో శ్రీ శ్రీ ధిక్కారస్వరం, కాళోజీ ప్రజాస్వరం కనిపిస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ జలజం సత్యనారాయణ మార్గంలో కవి లక్ష్మణ్ గౌడ్ సమకాలీన సమస్యలను ఆవిష్కరిస్తూ రాయడం కవి లక్షణమన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది వి.మనోహర్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణ్ గౌడ్ కవిత్వం రాస్తూ సమాజాన్ని చైతన్యపరుస్తున్నాడన్నారు. ఈ పుస్తకాన్ని ప్రసిద్ధ విద్యావేత్త, అనువాదకులు జలజం సత్యనారాయణకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బుర్రి వెంకట్రామారెడ్డి, లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ కరస్పాండెంట్ జి. అరుంధతీరాయ్, లుంబిని పాఠశాల వ్యవస్థాపకులు జి.సంయుక్తారాయ్, పాలమూరు సాహితి అధ్యక్షులు డా.భీంపల్లి శ్రీకాంత్, బాదేపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**చురక**

హైటెక్ సిటీ లాగే మరో
హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ
భవిత ఏమో కాని ఇదీ
బాహుబలుల లాభసాటి
ఉద్యోగ సృష్టి విజన్
ఉంటే మంచే కాని జనం
భూములు లాక్కున్న ఏది
పరిహారం విలువ ఘనం



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

బాగ తెలిసిన వాని
లాగ గీరలు పోని
వాడు నిజమగు జ్ఞాని
అనును రాధశ్రీ !!
వాళ్ళు మన సోదరులు
వీళ్లు రస మాధురులు
ఇంకేల వాదనలు
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210









ఈనెల 20 సోమవారం డా॥ కేతవరపు రాజ్యశ్రీ రచించిన "శ్రీ లలితా సహస్రనామ వ్యాఖ్యానం-2" "ఓ వర్షపు సాయంత్రం" కథా సంకలనం పుస్తకావిష్కరణలో వంశీ రామరాజు, పొత్తూరి సుబ్బారావు, జి. వల్లీశ్వర్, ఆవిష్కర్త డా॥ వోలేటి పార్వతీశం, డా॥ కేతవరపు రాజ్యశ్రీ, స్వాతి శ్రీపాద, డా॥మోచర్ల రామలక్ష్మి, డా॥ముక్తేవి భారతి, మాధవరావు.

నేటి నిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

2 హైదరాబాద్    ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433    గురువారం 30-4-2026


## తెలియదు



ఊర్వని వాకిలికి తెలియదు..
ఆ ఇంట్లోని మనిషి ఒకరు చచ్చారనీ,
వేసిన కొర్రాయికి తెలియదు.. మరణసూచిక తాననీ,
వేసిన టెంటుకు తెలియదు.. చావునీడగా తాను నిలిచాననీ,
వచ్చిన శవవాహనానికీ తెలియదు..తనది చచ్చిన ప్రయాణమనీ,
పెగిలే చితిమంటకూ తెలియదు.. దహనం వానికి నొప్పి కలిగించలేదనీ..
విచిత్రం ఏమిటంటే,
ఆ శవం వెంట నడిచిన మనుషులకూ తెలియదు..
తమకూ ఇలాంటి రోజొకటి వస్తుందనీ..!



–డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, 9441406252

## కొడుకు

అతడో గొప్పకవిగా
ప్రఖ్యాతినొందాడు.
ప్రజల గురించి
వందలాది కవితలు రచించాడు.
శిల్పం
భావుకత
అతనికి రెండు కళ్ళు.

విషాదమేమిటంటే
అతని ముసలి తల్లిదండ్రులను



స్టోర్ రూంలో ఉంచాడు.
అతని ప్రజల్లో
వీరు లేకపోవడం
ఆశ్చర్యంలో కెల్లా ఆశ్చర్యం.

నిజానికి
కవి కావడం కన్నా
మనిషి కావడమే గొప్ప.



–డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# "ఆత్మీయంగా పలకరిస్తున్న నిఖిలేశ్వర్ జైలు జ్ఞాపకాలు"





విప్లవకవులు చెరబండిరాజు, జ్వాలాముఖి గార్లతో జైల్లో గడిపిన ప్రముఖ కవి, విప్లవవాది నిఖిలేశ్వర్, జైలులో తనకు కలిగిన భావాలను యధాతథంగా అందించిన జ్ఞాపకాల రూపమే ఎమెస్కో వారు ప్రచురించిన 'గోడల వెనుక' పుస్తకం. పేజీలనిండా పలకరిస్తున్నవి నిఖిలేశ్వర్ జైలు జ్ఞాపకాలు మాత్రమే కాదు, కలకాలం మన జ్ఞాపకాల అలమారాల్లో దాచుకోదగిన ఎన్నో ఆసక్తికర విషయాలు వాటి గుడారాల్లోకి మనల్ని ఆహ్వానిస్తున్నాయి.

రాజ్యాంగ యంత్రానికి తన శక్తిని ధారపోస్తూ, నిజాలు మాట్లాడుతూ, అన్యాయాన్ని ప్రశ్నించే పౌరుల జీవితాలను చీకటి నరకంలోకి బలవంతంగా నెట్టి సామాన్యుడ్ని శక్తిహీనుడిగా మార్చే ప్రదేశమైన జైలులోకి ప్రవేశించాక **'కాలం స్తంభించి పోయింది. మేము స్వేచ్ఛగా కాలం రెక్కలపై ఎగిరే స్థితి నిశ్చలమై ఒక పరిధిలోకి కుక్కబడింది...'** అంటారు ఒకచోట నిఖిలేశ్వర్. చీకటికి వెలుతురికీ పగలని కోటలా వున్న జైలు గోడల మధ్య గడుపుతున్న ఆయనకు ఆ ముందురోజు రాత్రి తనను అరెస్టు చేసిన తరువాత తన ఇంటి దగ్గర కన్నీళ్లు పెట్టుకున్న తన అమ్మ, భార్య, పిల్లలు ఒక్కసారిగా జ్ఞాపకానికొచ్చారు. ఉక్కలో బొద్దింకల మధ్య, ఉమ్ముల మరకల నడుమ రాత్రి 12 దాటినా ఆయనకు నిద్రరాలేదు. అదే సమయంలో ఈ సమాజానికి, దేవునికి ప్రతినిధిగా వుంటూ హోమో సెక్సువల్ అలవాట్లు వున్న ఓ సన్యాసి కూడా ఏదో నేరం మోపబడి అక్కడికి వచ్చాడు. అతగాడు మాత్రం, పోలీసులకు ప్రమాదం కాని నేరస్థుడుగా స్వేచ్ఛగా సెల్ బయట గాలి తగులుతూ హాయిగా పడుకున్నాడు. ప్రజల కోసం కలం కదిలిస్తున్న తమకు మాత్రం సెల్ బయట పడుకునే అవకాశం లేదని, అందుకు రూల్స్ వొప్పుకోవని తేల్చేసిన పోలీసు వ్యవస్థ తీరును చూసి నిఖిలేశ్వర్ జాలిగా నవ్వుకున్న సందర్భమది. ఆ నవ్వు వెనక పోలీసు నిర్ణయాలు ఎంత వికారంగా, దుర్మార్గంగా వుంటాయో ఆ యథార్థాలన్నీ వాటి రెక్కల్ని విప్పి ఈ పుస్తకం నిండా ఎగురుతున్నాయి.

**'నల్లగొండా గొల్లది / బంగారు కంటే వన్నెది...'** అంటూ నీటిహౌస్ మీద కూర్చొని పాటలు పాడే రంగయ్య జైలులో అందరికీ వంటవండి పెడుతూవుంటాడు. చేయని తప్పును వొప్పుకుని ఎందుకు రంగయ్య జైలుకు రావలసివచ్చిందో చెప్పిన కథలో అమాయకుడైన రంగయ్యను పోలీసులు దొంగతనం కేసుకింద పోలీస్టేషన్ కు తీసుకెళ్లి అతని డబ్బును, వెండి కడియాలను లాక్కొని, మోకాళ్ళలో రోకలి ఇరికించి, తలపట్టుకుని గోడకు బాదేస్తూ పెట్టిన చిత్రహింసలు, వాటిని చదువుతున్న పాఠకుల నేత్రాలవెంట కన్నీళ్ళనే కాదు, పోలీసుల దుర్మార్గాల పట్ల నిరసనభావాన్ని రక్తంనిండా మరిగేలా చేస్తున్నాయి. కాలానికి – దూరానికి విభేదాన్ని మరచిపోయి గడుపుతున్న సమయంలో తన నల్ల తమ్ముళ్లకోసం సర్వస్వం అర్పించటానికి సిద్ధపడి, శ్వేతజాతి అహంకారానికి బలైపోతూ... **'జైలు నిర్బంధం దాదాపు చావులాంటిది. ఎవరైనా, ఎప్పుడైనా ఈ జీవితకాలంలో ఆ అవస్థను అనుభవించవలసి రావచ్చు...'** అంటూ లాయర్ జార్జ్ జాక్సన్ రాసిన లేఖలోని సంగతులు ఈ పుస్తకంలో ఎన్నో సత్యాలకు సాక్షి సంతకాలు పెడుతున్నాయి.

తన భార్య చేసిన మోసానికి ఆమెను నరికేసి జైలుశిక్ష అనుభవిస్తూ, జైల్లో వార్డెన్, ఆఫీసర్ల బట్టలు ఉతుకుతూ, జైల్లోనే హిందీ పరీక్షలు రాస్తున్న మోహన్ సింగ్ విషయం చాలా ఆసక్తికరంగా మనసును తాకుతోంది. పొలం తగాదాల్లో చిన్నాన్న కొడుకును నరికేసిన మారుతి, వైమానిక దళంలో చేరి, ట్రైనింగ్ ఇష్టంలేక పారిపోయి సంవత్సరం జైలుశిక్ష అనుభవిస్తున్న యువకుడు, బాగా చదువుకొని మధ్యతరగతి జీవితం గడుపుతూ ఆఫీసుల్లో డబ్బు దుర్వినియోగం కేసుల్లో జైలుకొచ్చిన వారి కథలు మరోకోణంలో తాకుతున్నాయి. ఎమ్.ఎ. పాసై ఉద్యోగం దొరక్క చివరకు ఒక ఆఫీసరు ముందే తన సర్టిఫికెట్లను చింపివేస్తాడు. అదిచూసి కేకలేసిన ఆఫీసరుపై చేయి చేసుకూంటాడు. ఆ నేరానికి రామారావు జైలుకు వచ్చాడు. దేశంలోని నిరుద్యోగులందరి ప్రతినిధిగా అతడు కనపడుతున్నాడు. అతని చర్యవెనక ఉద్యోగాలు కల్పించలేని ప్రభుత్వ వైఫల్యాలు చాలాస్పష్టంగా కనపడుతున్నాయి

**'సంకెళ్ళు వేయబడ్డం కూడా పోటీపడే సౌఖ్యమే...'** అంటూ జైలులో ఎన్నోసార్లు ఘోరమైన యాతనలకు లోనైన మహావ్యక్తి 'హోచీమిన్' తన మానసిక స్థితిని వెల్లడించుకున్న ఈ పుస్తకంలోని మాటలు మరోసారి ఆయనను స్మరించుకునేలా చేశాయి. పై అధికారి ఆజ్ఞలను అమలు చేసే సేవకుడిగా, తన ఆలోచనల్ని ఎర్రబుట్టకింద మూసేసి, మరమనిషిగా మారిపోయే పోలీసు నేస్తం గురించి **'మాలోని మనిషివే / మా మనిషివే నీవు / పొట్టకూటికి నీవు / పోలీసు వైనావు...'** అంటూ చెరబండరాజు కలం విసిరిన నిజాలు మరోసారి మనసును తాకి ఆలోచించే రహదారుల వెంట నడిపించటం ఒక గొప్ప అనుభూతిగా మిగిలిపోతోంది. నిఖిలేశ్వర్ జ్ఞాపకాలనుంచి పల్నాడు తాలూకాలోని ఆ ప్రాంతాల వీరచరిత్ర మన కళ్ళముందు తన పరిచయానికి సిద్ధమవుతోంది. **'దాచేపల్లి – మాచర్ల జ్ఞాపకాలలో దాచేపల్లి బస్సు స్టాండ్ దాటి పైకి మాచర్లవైపు వెళ్తుంటే నాగులేటి వాగు గలగలా పారుతూ, తెల్లని నాపరాళ్ళపై జారుతుంటే శ్రీనాథుడి పల్నాటి వీరచరిత్ర జ్ఞాపకం వస్తోంది...'** అంటూ నిఖిలేశ్వర్ అందించిన ఆ గతించిన వైభవం మరోసారి తళుక్కుమంది.

ఈ పుస్తకంలో మరింతగా చెదరిపోని చిత్రంగా ఎప్పటికీ పలకరించే సన్నివేశం వెంకటరెడ్డిని ఉరితీసిన సందర్భం. అప్పు పేరుతో తనని తన కుటుంబాన్ని ముప్పు తిప్పలు పెట్టిన జానయ్యను కోపం పట్టలేక హత్యచేసి తానే లొంగిపోయాడు. అన్ని కోర్టులు అతనికి మరణశిక్షను ఖాయం చేశాయి. చివరకు రాష్ట్రపతి దయాభిక్ష కూడా లభించక ఉరిశిక్ష ఖాయమైపోయింది. ఉరితాడు లాగేముందు **'మిస్టర్ వెంకటరెడ్డి! నీ చివరి కోరిక ఏమిటి?'** అడిగాడు జైలు సూపర్నెంటు. బాధగా విచారంగా 'ఏమీ లేదు సార్! వస్తాన్ సార్!...' అన్నాడు వెంకటరెడ్డి. అనుకోకుండా హఠాత్తుగా 'విప్లవం వర్ధిల్లాలి' అంటూ వెంకటరెడ్డి గట్టిగా అరిచాడు. ఆ నినాదం కటకాల వెనకనున్న ఖైదీల చెవులదాకా దూసుకుపోయింది. ఉరిపీఠం కింద చెక్క కదిలింది... అంటూ ఆ జ్ఞాపకాన్ని చాలా సజీవంగా అందించిన నేపథ్యంలో **'భూమిపై రాలిన / ప్రతిమనిషి కన్నీటి బొట్టులో/ నేనూ ఎక్కాను శిలువ...'** అంటూ పలికిన **'మయకోవస్కీ'** పదాల వరుసలు ఈ పుస్తకంలో కవాతు చేయటం ఒక విశేషంగా వుంది. ఈ జ్ఞాపకాలలో ఒకచోట విప్లవవీరులు చేగువేరా, టాన్యా, అంగోలాలో, తుపాకీ ఎత్తి పోరాడిన గెరిల్లా యోధుడు అగస్టినో నేటోల ధైర్యసాహసల ముద్రలు ఆయా చరిత్రలలోకి మరోసారి పాఠకులను నడిపిస్తున్నాయి.

రాజ్యాంగం యంత్రం కింద ప్రాణాలను యౌవనాలను కోల్పోతున్న స్వచ్ఛమైన యువ విప్లవ జీవితాలకు అంకితం చేసిన ఈ పుస్తకం కేవలం నిఖిలేశ్వర్ జైలు జ్ఞాపకాలకే పరిమితం కాలేదు. జైలు వాతావరణానికి, దాని పరిసరాల ప్రభావాలకు, అధికారుల నైజాలకు, తోటి జైలు సహచరుల మనోభావాలకు... సమస్తానికి ఒక తైలవర్ణ చిత్రపటంలా నిలబడుతోంది. **'న్యాయాన్ని, ధర్మాన్నీ, పెట్టుబడినీ, ధనికవర్గాల్నీ కాపాడెందుకు మాత్రమే కోర్టులు, విచారణలు, శిక్షలు. చివరకు పేదల గొంతులకు గోడల వెనకాతల ఉరితాళ్ళు...'** అంటూ నిజాలు ప్రతిధ్వనిస్తున్న నేపథ్యంలో జైలులో ఒక బ్యారెక్ లో, కుట్రకేసులో దాదాపు మూడు సంవత్సరాల నుంచి విచారణాధీనంలో వున్న విప్లవ కమ్యూనిస్టు నాయకుడు నాగిరెడ్డి ప్రస్తావన, ఒకసారి అనంతపురం రైతు మహాసభలో ఆయనను దగ్గరనుంచి చూసిన సందర్భాన్ని కళ్ళముందు వుంచుతోంది. **'జైలులో దినాలను లాగుతున్న మాకు గతమే తప్ప వర్తమానం కనపడలేదు. మానసిక ఒంటరితనం ఇందరి మధ్య ఒకోసారి లోలోపలే కన్నీరు కార్చేది...'** అంటూ మనసు పొరల్లోని ఆవిరిని అక్షరాల రూపంలో అందించిన విషయాలు పాఠకుల్ని తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి.

శిక్షా కాలాన్ని కొంత తగ్గించి చూపించిన దానికంటే ఎక్కువ రక్తాన్ని పిండి దానినే రక్తదానం పేరుతో జైలులో ఒక వ్యాపారంగా చేస్తున్న బూర్జువా నీతిమాలిన చర్య కూడా పాఠకులకు చాలా స్పష్టంగా ఈ పుస్తకంలో పరిచయం చేయబడింది. నిఖిలేశ్వర్ జ్ఞాపకాలలో నిశ్శబ్దాన్ని పొడుస్తున్న పిచ్చుకల అరుపులు, కిటికీల ఆవల నెమ్మదిగా వీస్తున్న గాలితో కబుర్లు చెబుతున్న గుండుమల్లెపూల చెట్లు, చుట్టూ తెల్ల, తెల్లగా పసుపును పులుముకున్న గోడలు, గట్టిగా వినిపిస్తున్న కారు హారన్ చప్పుడు, బస్సుల రొద...ఇలా ఎన్నో సంగతులు సన్నివేశాల పరంగా తమ స్థానాల్ని పదిలం చేసుకుంటున్నాయి. నేరస్థులను సంస్కరించి మనుషులుగా మార్చి తిరిగి సమాజంలోకి పంపవలసిన జైళ్ళు, అవి కోరి మరచిపోయిన ఉద్దేశ్యాలను ఈ పుస్తకంలోని జ్ఞాపకాలు మరోసారి కంఠాలు విప్పి గుర్తుచేస్తున్నాయి. కాలీ కాలని రొట్టెలు, ఇసుకరాళ్ళతో నిండిన అన్నం, నీళ్ళను నిండుగా మోస్తున్న పల్చటి నాసిరకం కూరలు... ఇవి ఖైదీల ఆకలిని తీర్చటానికి హాజరవుతున్న వంటల సందడి. ఇలా వందలాది విషయాలు నిఖిలేశ్వర్ జైలు జ్ఞాపకాల నిండా తొణికిసలాడుతున్నాయి.

**'ఇవే జైలు గోడల ఆవల వున్నప్పుడు దాదాపు మూడు – నాలుగేళ్ళు ఉద్యోగరీత్యా సైకిల్ పై ఈ జైలు ముందునుంచో, వెనక నుంచో వెడుతుండేవాణ్ణి. అప్పుడు ఈ జైలు విచిత్రంగా భయపెడుతుండేది. ఈ ఖైదీలు మనుషులు కాదనిపించేది. కానీ ఈనాడు ఈ గోడల లోపల ఒక చిన్న ప్రపంచం మనలాంటిదే వుందనిపిస్తోంది. ఖైదీలు సోదరమానవులేనని జాలి కలుగుతోంది...'** అంటూ వ్యక్తం చేసిన నిఖిలేశ్వర్ మాటల్లో ఒక గొప్ప దృశ్యం సజీవంగా కనపడుతోంది. **' లోపల డొల్లగా, పైకి దృఢంగా వున్న ఈ గోడలకు విప్లవశక్తిని బంధించే బలం లేదు. జాతీయ బూర్జువా పాలన చివరి శ్వాసతోనే ఇవీ ఒకనాడు నిలువునా కూలిపోక తప్పదు...'** అంటూ పుస్తకం చివరి అధ్యాయాన్ని ముగించిన నిఖిలేశ్వర్ ఆఖరి మాటలకు బిగించిన పిడికిళ్లతో స్వరాలు స్వరపరచిన కంఠాలన్నీ సమూహికంగా మద్దతు తెలుపుతూ దిక్కులు దద్దరిల్లేలా నినాదాలు చేస్తున్న ఈ సందర్భం విప్లవ చరిత్రకు ఒక గొప్ప ముఖచిత్రంగా నిలిచిపోతోంది.



–సాహిత్య ప్రపూర్ణ డాక్టర్ కె.జి. వేణు
98480 70084

ప్రతులకు:
నిఖిలేశ్వర్
సెల్:9177881201







# ఇందూరులో ప్రారంభమైన "సాహిత్య బడి"



సభలో ప్రసంగిస్తున్న డా॥ నాళేశ్వరం శంకరం. వేదికపై డా॥ మద్దుకూరి సాయి బాబు, బైస దేవదాసు. డా॥ కాసర్ల నరేశ్‌రావు,



ఉత్తమ కవితా గానం చేసిన దారం గంగాధర్, కె.రజిత, నాగం సాయిలులను సత్కరించిన బైస దేవదాసు, డా॥ కాసర్ల నరేశ్‌రావు, డా॥ నాళేశ్వరం శంకరం.

ఇందూరు జిల్లాలోని కవులందరినీ సమీకరించుకొని, వర్తమాన కవులకు మంచి మార్గదర్శనం చేసేలా ఏర్పాటైన సాహిత్య బడి ఇందూరు జిల్లా కృషి అభినందనీయమని ప్రముఖ కవి తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం అన్నారు. ఈనెల 26న ఆదివారం నాడు జిల్లా కేంద్రంలోని ఇందూరు యువత కార్యాలయంలో సాహిత్య బడి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చేసిన నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ సాహిత్య బడి ఆధ్వర్యంలో ప్రతిరోజు కవితలు రాసేవారికి కొత్త అంశాన్ని ఇవ్వడం దానికి, తగిన ప్రక్రియను సూచించడం,రాసిన దానిని సాయంత్రం వేళ సమీక్షించడం చాలా సహనంతో కూడిన పని అని దీనిని సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఇందూరు బడి నిర్వాహకులు డాక్టర్ కాసర్ల నరేష్ రావు, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు లను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సమావేశంలో కవులను ఉద్దేశించి ప్రసంగిస్తూ నాళేశ్వరం వారు కవిత్వం అనేది ఒక నిరంతర తపస్సుతో సాధించాల్సిన వరమని దానికి, తగిన అధ్యయనం అభ్యాసం అనేవి రెండు కళ్ళని అన్నారు. నిరంతర సాహిత్య స్ఫూర్తితో మున ముందుకు సాగుతూ వర్తమాన సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యాన్ని కూడా కవులందరూ బాగా చదవాల్సి ఉంటుందన్నారు. మన నిజామాబాద్ జిల్లా సాహిత్యానికి పెట్టింది పేరని మన జిల్లా నుండి ఎందరో కవులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని, వారి వారసత్వంగా నిలుస్తున్న కవులందరూ సాహిత్యాన్ని ప్రేమించి, సాహిత్యాన్ని అనుసరించి, అనుసృజించి, అధ్యయనం చేసి తమ కవిత ప్రస్థానాన్ని కొనసాగించాలి అన్నారు.దీనికి గొప్ప వేదికగా ఇందూరు బడి నిలబడిందని వారు తెలిపారు.గత 40 రోజులుగా తాను ఈ సమూహంలో జరుగుతున్న కృషిని రోజు ప్రత్యంక్షంగా గమనించానని, చేయి తిరిగిన కవులతో పాటుగా వర్తమాన కవులు కూడా చక్కగా రాస్తున్నారని ఈ కృషి మరింత ముందుకు సాగాలన్నారు. పదునెక్కిన అక్షరాలే ఎదను తాకే కవితలుగా నిలుస్తాయని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న నేటి నిజం పత్రికా సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ, సాహిత్యబడి ఇందూరు జిల్లా వేదికగా జరుగుతున్న ఈ నిత్య కవితా సృజనా కృషి ప్రత్యేకమని, సాహిత్యం ఇక్కడ కొంత స్తబ్దంగా ఉందని, దానిని ఛేదిస్తూ ఇందూరు జిల్లా, సాహిత్య బడి పేరుతో రోజూ విభిన్న ప్రక్రియల్లో,వివిధ వస్తువులతో కవితలు రాయించడం, వాటిని సమీక్షించడం చాలా అద్భుతమని ప్రశంసించారు.

ఇందూరు కవులు ఈ ఒరవడిని ఇలాగే ఉత్సాహం తో కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కవి జీవితం, సాహిత్యం వేరువేరుగా ఉండరాదన్నారు. కవిత్వంలో చెప్పిన వాటిని కవి ఆచరించినపుడే, ఆ కవికి, ఖవితకు విలువ దక్కుతుందన్నారు. కవి ఆదర్శంగా తన జీవితాన్ని గడుపాలన్నారు. ఈ సాహిత్యబడి ద్వారా కొత్తకవులు రావాలని, వారిని తీర్చిదిద్దే కార్యశాలగా ఈ సమూహం నిలువాలని బైసదేవదాస్ ఆకాంక్షించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గారు కోరిన వర్తమానం అనే అంశం మీద అప్పటికప్పుడే కవితలు అల్లిన కవులతో కవి సమ్మేళనం జరిగింది. అలాగే ఈ 40 రోజులలో చైతన్యవంతంగా కవితలు రాసిన ఈమాసం కవులైన దారం గంగాధర్, కె. రజిత, నాగం సాయిలుకు బహుమతులను అతిథులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా సాహిత్య బడి ఇందూరు జిల్లా నిర్వహణ కమిటీని అందరూ కలిసి ఎన్నుకున్నారు..

ఈ కమిటిలో డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, డా. మద్దుకూరి సాయిబాబు, దారం గంగాధర్, కె. రజిత, నాగం సాయిలును సభ్యులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో కవులు దారం గంగాధర్, కే. రజిత, నాగంసాయిలు, స్వప్న, సోనీ, రాజ్కుమార్, ఇప్పకాయల సుదర్శన్, సిర్ప లింగం, శంకర్ గౌడ్, స్వర్ణసమత తదితరులు పాల్గొన్నారు.

## నాన్న ఎక్కడ?

అమ్మ
ప్రాణం పోసింది
చనుబాల్లతో ప్రాణం నిలిపింది
ఒడిలో లాలించింది
ఆడించింది
నవ్వించింది
వేలు పట్టి నడిపించింది
వెన్ను తట్టి ప్రోత్సహించింది
నా జీవితం అంతా అమ్మే కదా
మరి నాన్న ఎక్కడ.

జీవితం నెమరవేసుకుంటుంటే
మసకగా కనిపించాడు నా నాన్న
నా ప్రాణానికే మూలంగా
నా జీవిత ప్రయాణానికి ఊతం లా
అమ్మ పడే లాలిపాటికి పల్లవిగా
అమ్మ చూపించే ప్రేమకి ప్రేరణగా
అమ్మ చూపే ఆదరణకి ఆధారం లా
నా గెలుపు కి అజ్ఞాత ఆయుధం లా
నా జీవితపు ప్రతి మలుపులో దీక్షుచి లా
అమ్మకు నాకు అవసరం విచినపుడల్ల
నాన్నల అమ్మల ఊతం గా ఉంటూ
తను మా జీవితాలని నడిపిస్తున్నాడు
మాకు వెలుగునిస్తూ తను కరిగిపోతున్నాడు
నాకు నాన్న ఇపుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు
మా నీడలో కలిసి మాతో నడుస్తున్నాడు
తోడుగా ఉంటూ కాపు కాస్తున్నాడు



–ఫణి కుమార్ చకిలం
8978979545

## కాలుస్తున్న ఎండలు కాగుతున్న సముద్రాలు

ప్రచండభానుడి భగ భగలకు
నెగడులా మారుతున్న నేలతల్లి
ఉదయం నుంచే ఊపిరి సల్పని ఉక్కపోత
ఒడలను అదలగొడుతున్న వడదెబ్బ ,
అదృశ్యమైపోతున్న అడవిలో
పాపం పశుపక్షాదులు
గాసం దొరకక గోసపడుతున్నవి
గుక్కెడు నీళ్లలేక గొంతెండి చస్తున్నవి



ఆకాశ హార్మ్యాలకై
చెట్టు పుట్టలను చెరబడుతూ
అనంత సంపదకై
గుట్టలను గుటుక్కుమంటూ
పాశవికంగా పరిశ్రమిస్తు
గాలి మరల గదులలో
చలువ యంత్రాలు నీడలో
శీతల పానీయాలతో సేదదీరుతు
ప్రకృతిని వదిలిన మనిషి
ప్రపంచం పట్టక పరవశిస్తు
పతనమంచుకు చేరుతున్నడు.
మానవుడు చేసిన విధ్వంసంతో
సముద్రాలు కాగుతున్నవి
మండే ఎండలు కాలుస్తున్నవి



–డా॥ ఎడ్ల కల్లేశ్
9866765126

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1758వ రోజు 'ఆత్మస్తుతి- పరనింద' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ఆత్మస్తుతి- పరనింద' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



## నిన్ను నీవు ప్రశ్నించుకో!

ఎదుటి వారిని దూషించే ముందు
నిన్ను నీవు ప్రశ్నించుకో!
చెప్పేవి శ్రీరంగనీతులు
దూరేవి అవేవో గుడిసెలు.
చేసేది కాలా బజార్ వ్యాపారం
బయటికి పెద్ద మనుషుల్లా.
ఎదుటి వారిని వేలెత్తి చూపిస్తారు
పరనింద పాపమని తెలిసినా!
పరిహసిస్తారు తప్పులనెత్తి చూపుతూ
లేనిపోని గొప్పలు పోతారు
ఆత్మస్తుతితో ప్రగల్భాలు పలుకుతారు
తనకంటే గొప్పవాడెవ్వడూ లేడని
కళ్ళు మూసుకుని ప్రవర్తిస్తారు
పాలు తాగుతున్న పిల్లిలా
కలుగులో దూరిన ఎలుకలా
దొంగ చూపులతో ఎదుటి వాడిని
ముంచాలనే చూస్తారు.
ఇతరులను విమర్శించడమే
పనిగా పెట్టుకుంటారు
అహంకారంతో విర్రవీగుతుంటారు
పెదవులపై నవ్వులు చిందిస్తూ
వెనుక గోతులు తీస్తుంటారు.
సహనం వినయం ఓర్పు
నేర్పుతో యోచించు
సమయం
సందర్భానుసారం
మాట్లాడటం నేర్వాలి
మాటలతో మనసుకి
గాయం చేయకు
ఇతరులను నొప్పించకు
అవమానించకు
చెడు మాటలతో
స్పందించు సద్విమర్శతో
సానుకూల దృక్పథంతో
మానవతా విలువలను
గుర్తించు మంచి దృష్టితో..

-పి.పద్మావతి

## ఐబిజీరో!

ఐ ఇగో పోవాలి
జీరో ఏమిలేదు
అంతా శూన్యమనే
జ్ఞానం రావాలి
అసలు సిసలు పూర్ణపురుషులు
ఆత్మ స్తుతి చేసేవారిని చూసి
నిర్లిప్తతతో
నిందించేవారిని పట్టించుకోక
మొహంతిప్పుకో.
గురివిందగింజ సామెత
ఎంచక్కా వీరికి అన్వయం
తప్పులెన్నువారు
అంతా తమకే తెలుసనే అహంకారం
పతనానికి హేతువు
పరనింద మహాపాపం.
అందర్నీ మాటలు చేతల్తో
తేలుకొండి వ్యవహారం
ఇన్ఫీరియార్టీ కాంప్లెక్స్ కి పరాకాష్ఠ
దుర్యోధనుడు రావణ
కీచక కర్ణులందరిదీ ఒకే మనస్తత్వం.
నిండుకుండ తొణకదు
ఉట్టికుండ
లొడలొడ బుడబుడ
వాక్కుమహిమనెరిగి వాగకుండ
స్వోత్కర్ష కి తావివ్వక
నడుచువాడే ప్రాజ్ఞుడు
మొండివాడు రాజుకన్న
బలవంతుడు
మౌనంతో తొలగాలి
పెడచెవిన పెట్టాలి.
కర్ణపర్వంలో గాయపడ్డ ధర్మరాజు
ఆవేశంతో అర్జునుని గాండీవాన్ని తూలనాడితే
సవ్యసాచి ఆగ్రహంతో అన్నపై కత్తిదూసే.
కృష్ణ భగవానుని సలహాతో
తనని తాను పొగుడుకుంటూ
ధర్మజుని కసితీరా తిట్టి
తను చేసిన పాపానికి
విధించుకున్నాడు శిక్ష.
ఇతరులను తిట్టి అవమానించి
ఆత్మ స్తుతి చేసుకుంటే
చావుతో సమానం
మంచి ఎక్కడ ఎవరిలో ఉన్నా
ప్రశంస
ఓచిర్నవ్వుతో
అందరి ప్రేమాప్యాయతలు సొంతం
నేనే రాజు తరాజు
నవాబు షరాబు అని
దుమ్మెత్తి పోసుకునే రోజులివి
అందుకే దుష్టులకి దూరం
వీలైతే జవాబిచ్చి
ఆపై మన నోటికి తాళం వేస్తే
వాగి వాగి చతికిలబడు
నిశబ్దంతో కలహం నాస్తి
అలా అని ఊరుకుంటే మొత్తేరకాలు.
గొప్పలు తెప్పలుగా చెప్పుకోనీ
మన జోలికి రాకుంటే పదివేలు
ఇదే నేటి నిత్యసంఘర్షణలకు
పదవీకాంక్షలకు మూలం
అసూయ కుళ్లుబోతు
మనసుల అంతరంగం.

-ఎ.రాజ్యశ్రీ

## కొండంత బలం

ఆత్మస్తుతి పరనింద వలదురా
నరుడా మానవుడా
పరస్తుతి ఆత్మనింద కూడా
వలదని తెలుసుకోరా
స్తుతి నిందలు
చేతకాని తనపు మాపదండలు.
భ్రమలో తనివితేలని శ్రమలో
ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి
ఆత్మస్తుతి పరనిందలతో తృప్తి చెందే
మూర్ఖపు తత్వం వలదురా
నీకు శ్రేయస్సు కాదురా.
నిండు కుండ తొణకదురా
మంచు కొండ వణకదురా
లేనిపోని ధ్యాస లేమో
కానివాడిని చేతునురా.
ఆత్మస్తుతి ఆయుఃక్షీణం
పరనింద వినాశకారణం
రెండూ విపత్తుల ప్రేరణం
వదిలేస్తే కొండంత బలం.

-రాజప్ప

## గొంగళి పురుగులు!

అందరూ మహానుభావులే!
అయినా.. పలకరిస్తే చాలు
నయాగరా జలపాతాలు
తానుత్తమ...
ఎదుట మధ్యమ...
ఎక్కడో అధమ!!
ఇక చెప్పేది ఏం లేదు!!.
ఏ విషయమైనా మాట్లాడు.
గొప్ప విషయమైతే
ఆ కారణం తానే అంటాడు
నీచ విషయముంటే
ఫలానా వారే కారణమని తీర్పు!
ఏతా వాతా
వీరితో మాట్లాడాక పోయే ఓర్పు!.
ఈ క్రమంలో.,,
మనకి పోయే ఆత్మవిశ్వాసం
అంటుకునే పరనింద బంక!
ప్రతీ వారిలో కనిపించే లోపం
అందుకే
ఇలాంటి గొంగళి పురుగులతో
దూరం.
అవైనా కొన్నాళ్ళకి
సీతాకోక చిలుకలవుతాయ్!
ఇవి ఎప్పటికీ రూపాలు అంతే!!.

-ఎం.వి.ఉమాదేవి

## నిజాయితీ

నాకే అంతా తెలుసు,
నాకు తెలిసినంతగా
ఎవ్వరికీ తెలియదు.
నాకే అన్నీ అన్ని వచ్చు
నా అంత బాగా
ఎవరూ పని చేయలేరు.
అని ఆలోచిస్తూ
ఎప్పుడూ
తమ గురించి
గొప్పలు చెప్పుకుంటూ
తిరిగేవాళ్లు చాలా మంది.
అహంకారం ఉంటుంది వారికి.
అహంకారంతో
విర్రవీగుతూ ఉంటే
ఆకాశంలో విహరిస్తూ ఉంటే
ఏదో ఒక రోజు రెక్కలు విరిగి
పడతారు కిందకి.
ఎంత ఎదిగినా
ఒదిగి ఉండే వారు కొందరు.
అహంకారంతో
ఒదిగి ఉన్న వారిని
అవహేళన చేస్తారు.
ఆత్మ స్తుతి చేసేవారెప్పుడూ
గుర్తించలేరు ఒకరి ప్రతిభను.
ఏ కళ అయినా
అందులో తప్పులెన్నుతారు.
తమ తప్పులు
ఏదో ఒకరోజు
బయటపడతాయని
తమ తప్పుల్ని ఎంచేవారు
మరొకరుంటారని ఆలోచించరు.
వారికి చాలా పెద్ద
దెబ్బ తగలవచ్చు
బాగా అవమాన పడవచ్చు
కానీ అది ఆలోచించరు కదా
అహంకారం వద్దు.
ఆత్మస్తుతి వద్దు.
నిజాన్నినిర్భయంగా ఒప్పుకోండి.
నిజాయితీగా బతికితేనే మంచిది.

-డా.షహనాజ్ బతుల్

## గురివింద గింజ

నిజాయతీ నమ్మకాలే
పెట్టుబడి అయితే
పదిమందిలో మంచి పేరే రాబడి!
మంచితనం మానవత్వాల
మేళవింపుతో
నిండైన వ్యక్తిత్వమే నీదైతే
శాంతి, సంతృప్తులతో
నిండిన హృదయమే
బదులుగా వచ్చే బహుమతి!
నీవు అవినీతిని అంటిపెట్టుకుని
నీతి పద్యాలు వల్లెవేస్తూ
ఎదుటివారిలో నీతిని
ఆశిస్తే ఎలా?!
పచ్చ కామెర్ల వాడి చందంగా
అందరూ నమ్మకద్రోహులే అని
భావిస్తే సరా?!
నీవు ఇతరులకు ఏమి ఇస్తావో
అదే నీకు తిరిగి దక్కేది!.
మనసులోని భావనలే
చేతలలో తేటతెల్లమయ్యేది
నీ మనసులోని కల్మషమే
లోకమంతా వెదజల్లబడేది
దృష్టిని బట్టే కదా సృష్టి!.
తప్పులెంచుటే తప్పు
నీ తప్పులెరుగక
గురివింద గింజలా గొప్పలకు
పోక
మనసులో పేరుకున్న
మాలిన్యాన్ని తొలగించు.
మహిలో మనిషి పుట్టుకకు
బాధ్యత వహించు!.

-చంద్రకళ దీకొండ

# మినీ కవితా వెలుగులు
# -డా॥ రావి రంగారావు



**ప్రతులకు:**
డా॥రావి రంగారావు
సెల్: 9247581825



వచన కవితా పరిణామంలో లఘు కవితా ప్రక్రియగా శక్తిగా స్వేచ్ఛగా దూసుకొచ్చింది. మినీ కవిత అంటారు డా॥ రావి రంగారావు. స్వల్పా క్షరాలతో అనంత భావాల్ని వెదజల్లే **'మినీ కవిత వెలుగులు'** ఫేస్‌బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూప్‌లో వారం వారం మినీ కవితల పోటీలు- కవిత, ఫలితాల విశ్లేషణలు ఒక సంకలనంగా రావి రంగా రావు సాహిత్య పీటం ప్రచు రింప చేసింది. అమ్మ నొచ్చు కున్న మనసు మంచు, అనురా గంగా కరిగి నీరయ్యె కవితాత్మక షేక్ బషీరున్నీసా బేగం, బతుకు గాలిపటం అందంగా ఎగరేను కోవాలనే సందేశం అందించిన మేడిశెట్టి యోగేశ్వరరావు, కోడిపుంజును కర్షడితో పోల్చిన శింగరాజు శ్రీనివాసరావు, మనిషి ఆకలి చూపుకు నమిధ శ్రీధర్ కొమ్మోజు, ఎజెండాల జెండాలు ఏ ఎండకా గొడు గులు జెండా కవిత పాణిరావు యర్రగుంట్ల, పత్రికలు అం శంపై అసత్యాలను మోసి ఊరే గిస్తున్న పల్లకీలు నేటి పత్రికలు అన్న చింతా రాం బాబు, అమ్మాయి పాలు అబ్బా యి చక్కెర మనసు గుడిలో తీర్థం ప్రేమ అన్న వసుధ బి. రావు, అధికారం అమ్మ అయితే ప్రేమ అందరికీ, అమ్మ కానిది అయితే కొందరికే గొప్పగా చెప్పిన కొండ్రెడ్డి నాగిరెడ్డి, శ్రమ బీజాన్ని నేలలో నాటితే ఫలాలు ఆర్తుల కు అందుతాయనే అన్వయం అందించిన కృష్ణవేణి పరాం కుశం, స్నేహం చిటికెలో మాయ మయ్యే మెరుపు కాదు నిలకడగా వెలిగే దీపం' అన్న చిత్తలూరి, జేబులో డబ్బు నిండుకుంటే ఎటు చూసినా ఎడారే అన్న జాగరాపు శంకర్రావు, తెల్లరక్తక ణాలే దాడి చేస్తే అంటూ దారి తప్పిన నాయకుల అవినీతి ప్రస్తా వించిన ధనుంజయరెడ్డి, ఓటు అంశంపై ఎన్నికలను వేల చుక్క పండగ అనటం, పుచ్చుకోవటం పదాలను చక్కని శ్లేషతో ప్రయోగి ంచిన గోలి హనుమ చ్ఛాస్త్రి, గ్రామాలు అంశంపై పచ్చదనాలు పందిళ్ళు వార్ధక్యపు ఆనవాళ్ళుగా తేడా చెప్పిన నాగిరెడ్డి కొండ్రెడ్డి 13 అంశాలపై 13 వారాల ఉత్తమ కవితల ప్రతిభా పురస్కారాలు, 90 ప్రశంసా పత్రాలు, తెలుగు నాట 728 మంది కవులను మినీ కవితలు రచించే ప్రేరణ కలిగించారు.

ఉత్తమ మినీ కవితలు, విజేతల కవితలతో పాటు మరికొన్ని కవితలను క్రమం తప్పకుండా నేటినిజం సాహితీ కెరటాలు ఎడిటర్ శ్రీ బైస దేవదాసు యితర సాహితీ మిత్రులు శ్రీ యక్కలూరి శ్రీరాములు, ఫే స్బుక్, వాట్సప్ కవులకు మినీ కవిత వెలుగుల ప్రసంరింప చేస్తున్న డా॥రావి రంగారావు సాహితీ సత్కృషి అభినందనీయం.



-జయసూర్య
9440664610

## ఆరోగ్యానికి హానికరం

ఫాస్ట్ ఫుడ్ తింటే అనారోగ్యమే...
అయినా అలవాటు పడుతున్నారు...
నిల్వ ఉన్న పదార్థాలు వేడిచేసి ఇస్తారు..
ఆన్ లైన్ ఆర్డరు లో ఏమి పంపుతారో?.
వాడిన నూనెలు వాడుతూ ఉంటే...
అది జీర్ణాశయం పేగుల కు చుట్టుకుంటూ
వచ్చే కొత్త రోగాల అంతు చిక్కక...
చేయించుకుంటున్నారు పరీక్షలు...
ఇద్దరూ ఉద్యోగస్తులు ఐతే వంట కష్టమే..
చూసే పెద్దలు ఉంటారు ఎక్కడో ఎదురు చూపులతో...
ఒంటరిగా ఉన్నపిల్లలకు ఫాస్ట్ ఫుడే గతి...
జంక్ ఫుడ్ కోసం చేస్తారు మారాం...
బిజీ జీవితం లో
ఫాస్ట్ ఫుడ్ ప్రత్యామ్నాయం...
వీకెండ్ తిరుగుడు పార్టీలు..
ప్రతిరోజూ బిజీ జీవితాలు...
మన వంటలు దొరకవేమో
రాబోయే తరానికి.

-షామీర్ జానకీదేవి
+91 93946 11037

## ఆదరణాయుత పలుకులోనే దైవదర్శనం

చూపుసరిగ్గాలేని
నడవలేని పెద్దలను
పలుక రించాలని ఎవరికుంది. !
మూల గదుల్లో విసిరేయడం తప్ప
పొలి మేరల్లో వదిలేయడమే గొప్ప
మానవత్వం మరుగౌతున్న నేటి సమాజంలో.!
అష్టకష్టాలు పడి అప్పోసొప్పోతెచ్చి
ఆలనాపాలనా చూసి
విద్యాబుద్ధులు నేర్పి.బతుకుబాటలో నిల్పితే
వారికి వయసుడిగి మనదరి చేరిన నాడు
దయమాలి వారిని చీత్కార భావనతో చూస్తే.
అభిమానమే మూలధనం గా బతికిన
ఆ ముసలి ప్రాణులు విలవిల ఏమని తెలుపాలి.?
అందరు దాటి రావాల్సిన చరమదశ
మనము మినహాయింపా..ఆలోచించండి.
కాస్తంత ఆదరణ.. చూపుతూ వారితోకాస్త
సమయం గడిపితే రుగ్మత మర్చిపోయి
సంతోషిస్తారు.గదా..
ఆస్తులు అంతస్తులు పంచీ ఏమీ మిగుల్చుకోకుండా
మన పంచన చేరారని తృణీకరించవలదు.
కలదు వీడలేమంటూ మనలనుసరించే మనకాలం.
పెద్ద పెద్ద హోదాల్లో పనిచేసిన వారూ.
ఆత్మీయ బంధంతో
ఎంతోమందికి సహాయపడిన
వాళ్ళు. గుప్పెడు ఆనందంకోసం.
నాలుగు ఆలంబనాయుత పలుకుల
కోసం
తహతహలాడుతున్నారు.
పెన్షన్ మొత్తం
నెలమొదటనే లాగేసుకోవటం
అనాదరణగా. చూపడం..ఎంత బాధ..
ఎంత బాధ..
గేదెల మధ్య కోళ్ళమధ్య ఇరుకు ఇళ్ళల్లో
బతికిన ఆరోజుల్లో సంతోషంగా ఉన్నాం.
ఆ పేడ వాసన ఆ కోళ్ళ వాసన..
కల్పేది బంధాలు.
ఈ రోజుల్లో ప్రతిదీ వేస్టే..
ముందుండదా.
మనం ముసలాళ్ళాం అవమా..
కళ్ళు తెరవాలి..
ఆదరణలో భగవంతుడు నిలబడు.

-యయక్కంటి పద్మావతి
+91 98496 14898



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## అపురూప దృశ్యం

నీలి నింగిలో
నిండు జాబిల్లి వెలిగిపోతుంటే!
వెన్నల జల్లు కురిపిస్తుంటే
వేల తారకలు తడుస్తున్నాయి!
జ్యోత్స్న చినుల్లో స్నానాలాడుతూ
మురిసి పోతున్నాయి!
సుందరమైన ఆ దృశ్యాని
మెరుగులు అద్దినట్లుగా!
చుట్టూ పచ్చని పంట పొలాల
మధ్య అందమైన ఇల్లు!
పరుచుకున్న వెన్నెల రాత్రి
ఆరుబయట కుటుంబసభ్యుల
ముచ్చట్లు!
మంచంపై సేద తీరుతున్న
యజమాని రైతు పక్కనే కొడుకు!
వంటా వార్పుతో
ఇల్లాలు కబుర్లు చెబితే!
వింటున్న పెద్దావిడ అమ్మ
కొడుకును తనివితీరా చూస్తూ!
వాకిట్లో పెంచిన మొక్కలు
యజమానుల సంతోషం
పంచుకుంటూ!
భాగస్వామ్యులై వింటున్న చందం
మరింత శోభనీయం!
అలసిన మూగ జీవులకు
సాయంకాలపు విశ్రాంతి కాబోలు!
మేతమేస్తూ తన్మయంగా కడుపు
నింపుకొంటూ ఉన్నాయి!
చూడ చక్కని దృశ్యమాలికతో
చూసే కనులకు కమనీయం!
కవుల కలానికి పదును పెట్టే
అపురూప చిత్రం!

-మద్దెల సరోజనల
+91 99083 52377

## అమ్మ ఒడి

మంచితనం నిండిన
ప్రతి మది ఓ గుడి
మనిషికి అమ్మ ఒడి
అనుభవాలు నేర్పే బడి
జీవిత పాఠాలను నేర్చుకుని
వల్లె వేసే అందమైన గుడి.
ప్రతి మనిషి యొక్క
బంగారు భవితవ్యాన్ని
తీర్చి దిద్దే దే బడి.
అజ్ఞానమనే చీకటిని
తొలగించి జ్ఞానమనే దీపం
వెలిగించే వాడే గురువు.
ఒక దీపం ఇంకో దీపాన్ని
వెలిగి స్తుంది
ఒక విద్యావంతుడు పది మంది
విద్యావంతులను
తయారు చేస్తాడు.
గుడిలోని దేవుడు మోక్షాన్ని ఇస్తే
బడిలోని దేవుడు జీవితంలో
వెలుగులు నింపుతాడు
చదువు కుని భవితవ్యాన్ని
బంగారంగా మార్చుకో..

-రమాదేవి వొజ్జల
+91 90322 24588

## హితోక్తులు

మాటతోనే బతుకు మాటతోనే మనసుల గెలుపు
మాటలే మనిషి ప్రతిబింబం
మాటల్లోనే కనబడుతుంది వ్యక్తిత్వం
మాట తియ్యగుంటే ప్రతి చోటా జయం జయం
మాటే మనిషికి అంతర్గత బలం
మాటతోనే బతుకు సమైక్యం
మాటే మనసులను దోచుకునే మంత్రం
మాట మంచిదైతే బలపడుతుంది బంధం
మాటే సుఖ జీవనంకు దోహదం
మాట నిదానమైతే సాఫీగా సాగు జీవిత పయనం
చదువే చైతన్యం చదువుతోనే మనిషికి నిండుదనం
చదువే మూడో నేత్రం జ్ఞాన ఆయుధం
చదువే విచక్షణ తెల్పు గీటురాయి
చదువే వెలకట్టలేని ధనం
చదువుతోనే వచ్చు గౌరవం
చదువే సుఖమయ జీవిత ఆధారం
చదువు అందరి జన్మహక్కు
చదువుతో పాటు సంస్కారం ఉంటే ఎంతో మేలు
చదువే జగతిలో జాగృతి కలిగిస్తుంది
చదువే లేకుంటే బతుకు శూన్యం అవుతుంది

- షేక్ సలాం, +91 99639 30993

పుస్తక సమీక్షలు

# మనం మరిచిన పాలమూరి చరిత్ర.. మళ్ళీ ఓసారి మననం..

స్వర్గీయ డా॥ కపిలవాయి లింగమూర్తి ఉమ్మడి నాగర్ కర్నూలు జిల్లా వాసి. తెలుగు పండిత్‌గా, ఉపన్యాస కులుగా విద్యారంగానికి ఎనలేని సేవలందించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా. సుమారు 35 ఏళ్ళు తెలుగు భాషామతల్లి గళ సీమను తన రచనా హారము లతో అలంకరించారు. శత కాలు, సంకీర్తనలు ఉదాహర ణలు వచన గేయ పద్యకృ తులు, కావ్యాలు, ఆధ్యాత్మి కాలు, చరిత్రలు జీవిత చరిత్ర లు నిఘంటువులు, అనువా దాలు ఒక్కటనేమిటి- చేపట్టని సాహిత్య ప్రక్రియలేదు. అయితే, స్థల, వంశ చరిత్రలు వీరికి ఇష్టమైన ప్రక్రియ గా తోస్తుంది. శాసనాల కాలం కంటే మరి ంత లోతుకు వెళ్ళి చరిత్ర ప్రకటి ంచటంలో లింగమూర్తిగారి కృషి నభూతో నభవిష్యతి.

90 ఏళ్ళ నిండు జీవితం (జననం 31-03-1928 మరణం 6-11-2018)లో వందకుపైగా స్వీయ రచ నలు, వందలుగా చరిత్ర సంబ ంధిత వ్యాసాలు తెలుగు సాహి త్యానికి అందించిన ధన్యజీవి. ప్రస్తుత "ఉమ్మడి పాల మూరు జిల్లా కవి పండిత వంశాలు- యోగులు" 1974 నుండి 1978 వరకు సేకరించిన వ్యాస సంపుటి. లోగడ 'పరిశీ లన' అనుస్థానిక పత్రికలో మరికొన్ని పత్రికలలో ప్రచురిం చబడినవి. డా॥



**ప్రతులకు:** డా॥ కె. కృష్ణమూర్తి,
ఇ.నెం.2-2-22/2,
ఫ్లాట్ నెం.101, ఎటర్నల్ స్మృతి, అజీజ్‌బాగ్, డి.డి.కాలనీ
బాగ్‌అంబర్‌పేట్-500 013
హైదరాబాద్-తెలంగాణ
సెల్: 85001 67845

కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళా పీఠము నాగర్ కర్నూలు వారి తరపున డిసెంబర్ 2022న ఆవిష్కరింప బడినది. సాహిత్య కళా పీఠము, కార్యదర్శి మరియు లింగమూర్తిగారి కుమారుడు కపిలవాయి అశోక్‌బాబు గారి ప్రత్యేక పూనికతో లోగడ ప్రచు రించిన వ్యాసాలను సేకరించి ప్రకటించినారు.

సంకలనంలో అధ్యాయాలు న్నాయి. నేటి నాగర్ కర్నూలు ప్రాంత నాటి పాలకులైన సురభి వంశంతో మొదలిడి రాపోలు (అలంపూరు) సంస్థానానికి చెందిన వెల్లాల వంశం వారిని, విద్వత్ శ్రేష్ఠులైన అక్షింతల వంశం వారిని ఆ తరువాత కొల్లాపూర సంస్థాన్ ఆశ్రయం పొంది ప్రకాశించిన తెలక పల్లె వంశం వారిని పరిచయం చేసారు. వంశ పరిచయంలో.. తెలిసినంత మేర లోతుకు వెళ్ళి వారి మూలాలను శోధించి, ఆ వంశంలో ప్రసిద్ధు లైన వారు వారి కావ్య సంపదను పరిచయం గావించారు లింగ మూర్తిగారు. సురభి సంస్థానాదీ షులు వారి ఆస్థాన కవులతో మొదలిడిన లింగమూర్తి గారి పరిచయాలు, 19వ శతాబ్దపు మహాయోగి నారదగిరి లక్ష్మణ దాసు మరియు 20వ శతాబ్దపు పాలమూరు జిల్లా కవి చంద్రుడు ఇమ్మడిశెట్టి చంద్రయ్య వరకు సాగినది.

పూస గ్రుచ్చినట్లు సంఘట నల వివరణ, పరిచయం చేయు చున్న వ్యక్తి కుటుంబ వివరాలు, అలా పరిచయం గావించబడు తున్న వ్యక్తిని మార్చిన సంఘ టనలు సన్నివేశాలు కన్నులకు కట్టినట్లు వర్ణించారు రచయిత లింగమూర్తి గారు. ఈ వివరాలు ఈయటం వల్ల రచయిత సాధికా రిత సాధించి పాఠకుల మనసులో చెరగని ముద్ర వేయగలిగారు. బోయవాడు వాల్మీకిగా మారటం, తులసీదాసు మహాకవిగా మారి రామాయణాన్ని వ్రాసినట్లు కపిల వాయి వారు పరిచయం చేసిన కవులందరూ ఏదో వో మహత్త రమైన సంఘటనకు వారు సాక్షీ భూతులవక ముందు సామాన్య జనులే! ఆ సంఘటన వల్ల వారి జీవితాలు మారి పోయి అసాధారణ ప్రజ్ఞను స్వం తం చేసుకోగలిగారు.

మచ్చుకు కొన్ని.. త్రియం బక స్వామి (పేజి 183) పరస వేది విద్య, తనువు చాలించటం, సమాధిలోంచి లేచి అదృశ్యమ వటం, మహాయోగి నారదగిరి లక్ష్మణదాసు (పే.204) వట్టెం గ్రామంలో కొండ మీద వేంక టేశ్వరుని విగ్రహం స్థాపించ టం, ఆయన చూపులకు వరి గడ్డి మేటు కాలిపోవటం, సాధ నా మార్గోప దేశం సాధించి కుండలినీ విద్యను స్వంతం చేసుకున్న ఇమ్మటిజెట్టి చంద్ర య్య (పే.210) యోగికి బాలా త్రిపురసుందరి దర్శనం పొం దటం, ఆయన కుండలినీ విద్య అనంతరం ఆయన ఎవరిని తాకినా చిన్నపాటి విద్యుద్ఘాతం తగలటం- వీటన్నింటినీ డా॥ కపిలవాయి లింగమూర్తి ఈ సంకలనంలో వివరించారు.

"పాలమూరు సీమ చరిత్ర ను ఆర్తితో చెప్పిన అసాధారణ శక్తి గల పరిశోధక మూర్తి" అని కొనియాడటంలో ఏ మాత్రమూ అసత్యములేదు.

ప్రతీ అధ్యాయము ఒక కథలా వివరించి ప్రతి అధ్యా యపు పఠనీయత పెంచిన లింగ మూర్తిగారు ధన్యులు.

వీరికి జన్మనిచ్చి ఉమ్మడి పాల మూరు జిల్లా తల్లి ధన్యురాల యింది.

- **కూర చిదంబరం**
సెల్:8639338675



# అందరికీ ఉపయోగపడే మాటల శతకం

డా॥ సముద్రాల శ్రీదేవి, 'దేవిమాట శతకం-3' పేరిట వెలువరించిన తాజా రచనలో అన్నీ మంచి మాటలే వున్నాయి. ధనం పెరిగే కొలది దర్జాగా గుణ రాశి పెరుగవలెను, కానీ కరుణ లేకుండా, అహం పెక్కు గైన అంత మొందెదవు అంటన్న దేవి పలుకులు మెచ్చదగి నవి, అద్దం మీద దుమ్ము నిండితే ఏ విధంగా మన రూపం కనవదని విధంగా, స్వార్థం వున్న చోట సంతసంబును లేదు అంటారు. చరవాణి వలన వ్యాధులూ, బాధలూ వరుసగా సంభవిస్తు న్నాయనీ, అసలు కదలకుండా చరవాణిని ఉపయో గించరాదని మేడమ్ శ్రీదేవి మనకు హితవు పలి కారు. మౌనంగా భరిస్తే మంచి వాడంటారట, మెచ్చుకుంటారు. అలాగాక భరించ లేనివాడు లోకం మొరటు వాడిగా కాంచుతుందంటూ లోకం తీరును వివరించారు. ఎవ్వరి మీదా పగవద్దంటారు. ఎందుకంటే, కాలకాంత, అత గాడు గతులు తప్పిన పుడు ఒక దెబ్బ కొడుతుందని హెచ్చరించా రు. కలుపు మొక్క పెరిగిన విధంగా తులసిమొక్క పెరుగదు. అలాగే నీతిపరుడు ఈ భూమ్మీద గడిపినట్లుగా లంచగొండి బ్రతు కలేడని హితం పలికారు. తడిగా మాట్లాడుతూ మంచి పలుకులే గాక మనసులో కల్మషం లేకుండా వుండాలని చెప్పుకొచ్చారు. ఎవ్వరూ చూడనప్పుడు ఒక విధంగానూ గాక, నిజంగా ఎవ్వ రూ సవరిం చలేనట్టి ప్రవర్తనం వుండాలి అంటారు. గజము స్థలం కొరకూ, తులం బంగారం కోసం అక్క చెల్లెలు అనే బంధాన్ని కూడా తుంగలో తొక్కుతున్నారని విచారిం చారు శ్రీదేవి. ఈ విధమైన సూక్తులు ఈ శతకం నిండా మనకు దర్శనమిస్తాయి.

ఒక మంచి శతకమిది.



ప్రతులకు: డా॥సముద్రాల శ్రీదేవి, 4-84/1,
విజయ నివాస్ అపార్ట్‌మెంట్
దుర్గానగర్, దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్-500 060.
సెల్:99498 37743

- **డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761



## ప్రపంచ దివిటీలు

చూపుడు వేళ్లు సంతకాలు చేస్తేనే
కాలచక్ర యంత్రాలు తిరిగేవి.
చెమట చుక్కల నదులు పొంగితేనే
ముడి సరుకుల చక్రాలు కదిలేవి .
కార్మిక కర్షక అడుగులు వేస్తేనే
కాలగమన సోపానాలు నిద్రలేచేవి .
దేహపు కండరాలు కరిగిస్తేనే
ప్రపంచ చక్రాలు ముందుకు నడిచేవి.
జీవన సౌరభాల విత్తనాలను మొలకెత్తిస్తేనే
బతుకు పోరాటల ఆటలు గెలిచేవి.
కార్మిక ఆశయాల్ని తాకట్టుపెట్టి
మానవత్వంలేని విలువలను మూటకట్టి
నడుస్తున్న ఒంటెద్దు పోకడలపై
చెదలు పట్టిన చీడపురుగుల్ని
నాశనం చేసే విప్లవాగ్నిని రగిల్చే
ఆత్మ విశ్వాసపు దివిటీలు కార్మిక సూర్యులు.
తూర్పున సింధూరం తిలకం దిద్దిన
పడమట సంధ్యారాగం పాడిన
గొంతు నుండి రుధిర భాష్పాలు రాలిపడిన
గనులు కొలనులో దేహరక్తం చిందించిన .
రేపటి సూర్యతేజ కిరణమై
నిండు వెలుగులను ప్రసాదించే
గొప్ప హృదయం గల ధిక్కార స్వరాలు
నేటి 'మే'టి ప్రపంచ కార్మిక సూర్యులు.






-డాక్టర్ పగిడిపల్లి సురేందరు
0748 46063

## 'మనసు'

మనసుకు రెండు ముఖాలుంటాయి
నవ్వే మనసు చల్లగా, తెల్లగా ఉంటుంది.
అందంగా అందరికీ చేరువై.. ఆదర్శంగా నిలిచి
మాటలతో హృదయాలను గెలుచుకొంటుంది.
కడలి గర్భంలో జలనిధులు దాగి ఉన్నట్లు
మనసు పొరల్లో వ్యథల కథలెన్నో దాగుంటాయి.
మనసే మనిషికి ఆభరణం.
ఆ మనసే అదుపు తప్పితే అస్థిత్వాన్ని మింగేస్తుంది.
అహరహమూ అంతరంగాన్ని కాపాడుకొంటూ
ఆద్దంలా చూసుకోవాలి.
అద్దంలాంటి మనసు ముక్కలైతే అతకలేదు.
గతం చేసిన గాయాలను మాన్పడానికి
మనసే లేపనం కావాలి.
నిందించాలనుకొన్నా- ఎలుగెత్తి అరవాలనుకొన్నా
అణచుకొన్న ఆగ్రహం అలలా పైకెగెసి
చివరికి సముద్రలోనే కలుస్తుంది.
మనసు మనిషిలో ఒక భాగం
దాన్ని అదుపులో ఉంచితేనే మాట వింటుంది.
మనుగడకు మనో నిబ్బరం కావాలి.
బంధాలను బాధ్యతలను కలుపుకొని
చెట్టు క్రింద నీడలోకి చేర్చుకొన్నపుడు,
చీకటిలో దీపాన్ని వెలిగించి
అమ్మ ఒడిలో చేరదీసి, అక్కున చేర్చుకొని
అమృతంతో పాటు ఆశల బలాన్ని నింపితే
ఆ మనసంతా పూల పరిమళమై సాగిపోతుంది.
నల్లటి ముసుగేసుకొని లోలోన
విషపూరిత, విద్వేషాలతో రెచ్చగొడుతూ
రేపటి ఉషోదయాల కోసం నిరీక్షిస్తున్న
ఎదురు చూపులను చిదిమేస్తుంటే
ఆ మనసు చీకటితో చేతులు కలిపి
మరబొమ్మలా మిగిలిపోక తప్పదు.



-తాటి కోల పద్మావతి
9441753376

## పుస్తకం-మస్తకం...!

పఠిత మనమునందు పరగజ్ఞానంబును
చదువ పెంచు సతతముగను
మదికి హాయినిచ్చు మధురనేస్తముచూడ
పుస్తకంబు మేధ భూషితంబు!

పుస్తమొకటియున్న మస్తకచేతనై
జ్ఞానభిక్ష నొసగి జ్ఞప్తిపెంచు
ఇహముపరములన్ని యింపుగానేర్పించి
వినయ భావమిచ్చు విశ్వమందు!.

చిరుగు చొక్క తొడుగ చింతలేనేలేదు
చేత గ్రంథమున్న చెడదు మనము
హస్త పుస్తకంబు ఆలోచనలపెంచి
పఠిత మేధ పెంచి ప్రగతి చూపు!.

శాస్త్రవేత్తలకిల సకల జ్ఞానమునిచ్చి
పండితాఖ్యవరుల ప్రభలు పెంచి
సుకవి కలమునందు సుధలనుకురిపించి
ప్రజకు చేతనంబు పరగ పెంచు!.

పఠన వల్ల నబ్బు పరిజ్ఞాన మెంతనో
బాల బాలికలకు బంధురంబు
తెలివి తేటలన్ని తేనెధారల వోలె
మధుర భావనంబు మదిన పెంచు!.

విశ్వ జ్ఞానమొసగు విపులభావంబుల
చదివె వాడికిలను చదివినంత
వివిధ భాషలందు వెలుగొందు పొత్తముల్
పఠిత చిత్తమందు పారవశము!

పుస్తకంబు చదువు
పోవునజ్ఞానంబు
తెలివి హెచ్చుపఠిత
తేజమిచ్చు
పరమ జ్ఞానమిచ్చి
ప్రహ్లాదమునుపెంచి
చెంత పొత్తమున్న చింత
బాపు!
(అంతర్జాతీయ
పుస్తకదినోత్సవసందర్భంగా)



-డాక్టర్ గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493

## నక్క ఆకలి

(కథ)



సుందరవనం అనే అడవిలో ఒక నక్క ఉండేది. దాని పేరు టక్కరి. అది ఒకసారి ఆకలితో ఏదైనా ప్రాణి దొరుకుతుందేమోని ఆశతో అడవిలో వెదకసాగింది. కొద్ది దూరం వెళ్లేసరికి దానికి ఒక చెట్టు పైన ఉడుత కనిపించింది.

అది వగరుస్తూ "ఓ ఉడుతా! నీకు ఒక శుభవార్త చెప్పాలి. ఇలా రా!" అని పిలిచింది. అప్పుడు చెట్టు పైన గల ఉడుత ఇంకా కొంచెం పైకి పోయింది. "ఓ ఉడుతా!నిన్నే పిలిచేది. నీకు మంచి వార్తను చెబుతాను. క్రిందికి దిగిరా!" అని అంది. కానీ ఆ ఉడుత దిగి రాలేదు. పైగా ఇంకొంచెం పైకి పోయింది. నక్కకు లోలోపల ఆకలితో కడుపు మండసాగింది. అది ఎలాగైనా ఈ ఉడుతను పట్టుకొని తినాలని అనుకుంది. దానికి కోపం ఎక్కువై "ఓ ఉడుతా! నీవు కిందికి దిగి వస్తావా! లేకుంటే నన్నే చెట్టును ఎక్కమంటావా !" అని అంది.

అప్పుడు ఉడుత నవ్వి "ఓ నక్క మామా! నీకు చెట్టును ఎక్కరాదన్న సంగతి నాకు తెలుసు. నీవు చాలా ఆకలితో ఉన్నావన్న కూడా నాకు తెలుసు. నేను క్రిందికి దిగి వస్తే నీవు నన్ను పట్టుకుంటావని కూడా నాకు తెలుసు. అందుకే నేను క్రిందికి దిగిరావడం లేదు" అని అంది .

దాని మాటలకు ఆ నక్క విస్తుపోయి " ఔను. నేను ఆకలితో ఉన్నానన్న సంగతి నీకు ఎలా తెలుసు?" అని ప్రశ్నించింది. అప్పుడు ఉడుత నవ్వి "ఎలా ఏమిటి నక్క మామా! నీవు నన్ను చూసి పరిగెత్తి వచ్చావంటేనే నీకు ఆకలి అవుతుందని నాకు స్పష్టమైంది. నీవు ఒక కాకితో నీకు ఆకలి అవుతున్నదనీ, ఏదేని ఒక ఉడుతను పట్టుకుంటానని చెప్పావటగా! ఆ కాకి నా నేస్తం. అది నాకు ముందే నీ గురించి చెప్పి వెళ్లిందిలే! నీకు ఆకలి లేకుంటే నీవు నెమ్మదిగా వచ్చే దానివి కదా! నీవు నన్ను పిలిచావంటేనే నన్ను నీ పొట్టన పెట్టుకునేందుకే ఇలా క్రిందికి దిగి రమ్మన్నావని నేను గ్రహించాను. నేను ఇంకా క్రిందికి దిగివస్తే నీవు నన్ను పట్టుకుంటావని కూడా నాకు తెలుసు. నీకు చెట్టు ఎక్కరాదన్న సంగతి కూడా నాకు కాకియే చెప్పింది. అందులో నీవు జిత్తుల మారివి. నీవు ఇంతవరకు ఎవరికీ శుభవార్తను చెప్పలేదు.అందువల్ల నేను నిన్ను ఎలా నమ్మేది? అందుకే నేను నీ మాటలను నమ్మలేదు" అని అంది.

దాని మాటలను విన్న నక్క ఆశ్చర్యపోయి "అయ్యో! ఆ కాకి దీని నేస్తమని నాకు తెలియదు. నేనే ఆ సంగతి తెలియక నా తెలివి తక్కువ తనంతో ఆ కాకికి ఈ విషయం చెప్పాను. మరోసారి ఈ పొరపాటును చేయను. ఇప్పుడు నేను ఈ ఆకలితో మరొక ప్రాణిని చూసుకొనక తప్పదు " అనుకుంటూ అది అక్కడి నుండి వెళ్ళిపోయింది. ఆ నక్కను చూసిన ఉడుత పకపక నవ్వింది.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

పుస్తక సమీక్ష

# 'తుది వాంగ్మూలం' కవితకు సాహిత్యాభిషేకం...

కవన గర్భరాలు వంద సంవత్సరాల సాహిత్య సంపద నందు ఒదిగిన పేర్వెల పద్మ కుమారి గారి 'తుది వాంగ్మూలం' కవితకు నా చిరు స్పందన.

తెలుగు సాహిత్యం అక్షరాలతో నిర్మించబడిన అద్భుతమైన ప్రపంచం.

ఎందరో మహాకవులు/కవయిత్రులు తమ కలలు, భావాలు అక్షరాలతో వ్యక్తపరచడం ద్వారా అమరత్వం పొందారు అనేది సత్యం.

అమరత్వం పొందిన కవుల కవితలు ఒక చోట చేర్చి, మనకు అందించే ప్రయత్నం చేసినందుకు **'కవన గర్భరాలు'** పుస్తక సంపాదకులుగా వ్యవహరించిన శ్రీ చేపూరు సుబ్బారావు గారు, శ్రీ వి.కే. ప్రేమ్‌చంద్ గారు అభినందనీయులు.





వంద సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రలోని అత్యుత్తమమైన రచనలు ఒకే సంకలనంలో పొందు పర్చడం అనేది సామాన్యమైన విషయం కాదు.

మహాకవులు శ్రీశ్రీ, రవీంద్రనాథ్ ఠాగూర్, అడవి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ, ఘంటసాల వెంకటేశ్వరరావు, ఓల్గా, ఆరుద్ర, తనికెళ్ళ భరణి, అద్దేపల్లి రామ్మోహనరావు, కాళోజీ, గురుజాడ అప్పారావు, గుంటూరు శేషేంద్ర శర్మ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శిఖామణి, నగ్నముని మొదలగువారు తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధిగాంచిన కవులు.

యువకవుల సాహిత్యం కూడా నేడు కొత్తపుంతలు తొక్కుతోంది.అందుకే యువ కవుల కవితలకు కూడా ఈ పుస్తకంలో ప్రాధాన్యత ఇవ్వడం అనేది చాలా గొప్ప విషయం.

తెలుగు భాషకు ఒక అద్భుతమైన బహుమతిగా నిలిచిన ఈ కవితా సంకలనంలో స్థానం పొందిన కవులందరికీ హృదయ పూర్వక అభినందనలు.

వర్ధమాన కవయిత్రి పేర్వెల పద్మ కుమారి గారు వంటి ప్రతిభా వంతులకు ఈ గుర్తింపు లభించడం హర్షించదగిన విషయం.

అద్భుతమైన పదప్రయోగాలతో విలక్షణమైన రచనా శైలితో కవిత్వం రాస్తారు పద్మ కుమారి పేర్వెల గారు. కొత్తకొత్త పదాలను సృష్టిస్తూ, తెలుగు కవిత్వానికి వన్నె తీసుకువచ్చే ప్రయత్నంలో నిత్యం శ్రమిస్తుంటారు. సమాజంలోని అనేక సమస్యలను, స్త్రీల మౌన పోరాటాన్ని, స్వల్ప స్వేచ్ఛ కోసం పోరాడే హృదయాల స్పందనలను కవి త్వానికి అంశంగా తీసుకుంటుంటారు.

తన కవిత 'తుది వాంగ్మూలం' ఆచార్య ఆత్రేయగారి"స్వాతంత్ర దేశంలో చావు కూడా పెళ్ళిలాంటిదే బ్రదర్.... 'అనే భావాలకు అనుగుణంగా ఉంది. వంద సంవత్సరాలు తెలుగు సాహిత్యంలో ఈ కవితకు ప్రత్యేక స్థానం లభిస్తుంది

ఇదే కదా అక్షరం కల్పించిన గౌరవం.

కవితా సంకలనంలో వీరి కవిత్వం చదివి చూడండి. తెలియకుండానే చెమ్మగిల్లిన కన్నులను తడుము కుంటారు.

జీవితపు ముగింపులో కొన్ని వాస్తవాలను, అవాస్తవాలను ఆత్మతో చూసే క్షణాలు అక్షర రూపంలో ఈ కవిత్వం వినిపిస్తుంది (కనిపిస్తుంది).

శీర్షిక. తుది వాంగ్మూలం....

**వార్ధక్యపు వన్నెలు వెలిసిపోతున్నాయి**



కవన గర్భరాలు వంద నంవత్సరాల సాహిత్య సంపద నందు ఒదిగిన పేర్వెల పద్మ కుమారి గారి 'తుది వాంగ్మూలం' కవితకు నా చిరు స్పందన.

**రోజూ స్నానానికి నీళ్ళు అడిగితే తిట్టేవాళ్ళు**
**స్వయంగా నీళ్ళు తెచ్చి పోస్తున్నారు**
**అయ్యో.... మళ్ళీ చన్నీళ్ళే**
**అయినా చలి లేకుందేమిటో.**
**అదుగో ...కొత్త చీర...ఎంత బాగుందో**
**మా తమ్ముడే తెచ్చినట్లున్నాడు**
**ఏంటో..... ఈ అలంకారాలు కొత్తగా ఉన్నాయి**
**అపురూపంగా ఎత్తి పడుకోబెడుతున్నారు**
**బక్క శరీరమేగా కోర్కెలుడిగాక...**
**అయినా**
**నలుగురు ఎత్తుకుంటున్నారెందుకో**
**పూలతో అభిషేకం చేస్తున్నారు**
**తిట్టిన వాళ్ళు ఎందుకో కన్నీరెట్టుకుంటున్నారు**
**పదే పదే నన్ను తలుచుకుని**
**ఏదేమైనా ఈ స్థితి బాగుంది**
**జీవముండగా పొందలేనివన్నీ నాకొస్తున్నాయి**
**నవ్వుకుంటున్న నా ఆత్మ**
**ఇక అటూ ఇటూ పరిభ్రమించడం మానేసింది**
**అయినా నాకిది బాగుంది...**
**॥ పేర్వెల పద్మ కుమారి ॥**

పేర్వెల పద్మ కుమారి గారి 'తుది వానీగ్మూలం' అనే కవిత, జీవితం యొక్క అర్థాన్ని అన్వేషించే ప్రతి ఒక్కరికి ఒక దివ్యమైన దారి చూపుతుంది. ఈ కవిత మన మనస్సుల్లో ఎల్లప్పుడూ నిలిచే ఉంటుంది. 'వార్ధక్యపు వన్నెలు వెలిసిపోతున్నాయి' అనే పంక్తి, వృద్ధాప్యాన్ని ఒక అందమైన సూర్యాస్త మయానికి పోలిస్తూ, కవయిత్రి తన రచనా శైలిని ప్రదర్శిస్తుంది.

జీవితాన్ని ఓడి గెలిచిందో లేక... గెలిచి ఓడిందో కానీ,మరణం కంబళి ఒచిన చివరి క్షణాల్లో ఆమె మనస్సులో శాంతి, ఆనందం నిండి ఉన్నాయి. జీవితం యొక్క అన్ని కష్టాలను అధిగమించి, సుఖనిద్రలోకి జారుకుం టున్నట్లు అనిపిస్తుంది. జీవితం అనే గ్రంథానికి ఆమె వ్రాసిన అద్భుత అధ్యాయం, ప్రశాంతంగా మూసుకుపోయిన కళ్ళు కవిత్వానికి అమరత్వం పొందినట్లు తెలుపుతున్నాయి.

"కొందరి మరణం జీవితం యొక్క అర్థాన్ని ప్రశ్నించేలా చేస్తుంది." ఈ వాక్యం చాలా ఆలోచనని కలిగిస్తుంది. జీవితంలోని అన్ని అనుభవాలకు ఒక తుది ముగింపు ఉంటుంది.

కన్నీరు వెలిబుచ్చుకోవడం కేవలం భావోద్వేగాల ప్రకటన మాత్రమే కాదు, కొన్నిసార్లు ఇది ఒక నాటకీయ ప్రదర్శనగా మారిపోతుంది. సమాజం లోని స్థానాన్ని కాపాడుకోవడానికి, సాను భూతి పొందడానికి లేదా ఇతర లాభాల కోసం కొందరు కృత్రిమంగా భావోద్వేగా లను ప్రదర్శిస్తారు. ముఖ్యంగా కొందరి జీవితం అంతమయ్యే సమయంలో తమ ఉనికిని చాటుకోవడానికి ఈ విధంగా చేస్తారు.

కొందరు తమను తాము నిరూపించుకోవడానికి లేదా ఇతరుల దృష్టిని ఆకర్షించడానికి కన్నీళ్లను ఆయుధా లుగా ఉపయోగిస్తుంటారు. ఇది ఒక రకమైన ప్రశంస, సహాయం లేదా గుర్తింపు కోసం చేసే ప్రయత్నం.

బ్రతికుండగా పట్టించుకోని వారు కూడా మరణించిన వ్యక్తికి నివాళి ఇవ్వడం మరియు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరడం అనేది ప్రతి మతంలోనూ ఉన్నదే. మరణం తర్వాత ఆత్మ శరీరాన్ని వదిలి పరమాత్మను చేరుకుంటుంది అనేది కొందరి నమ్మకం. అందుకే ఇక్కడే మృతుడి శరీరాన్ని స్నానం చేయించి, శుభ్రం చేసి, సాంప్రదాయ వస్త్రాలతో అలంకరిస్తారు.

కవితలోని భావం పరిశీలిస్తూ కవితకు అర్థం శోధిస్తున్న నా భావం ఇలా...

బాల్యంలో బంధువులు ఎత్తుకుని తిరిగే శరీరం ఇప్పుడు నిర్జీవంగా మారింది. నిత్యం తిట్లు తిట్టేవారు ఇప్పుడు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక వ్యక్తి వ్యక్తిత్వం మరణం తర్వాత చుట్టూ ఉన్న సమాజం గుర్తిస్తుందా అనే ప్రశ్న మనందరినీ ఆలోచింపజేస్తుంది.

పుట్టింటి నుంచి వచ్చే ప్రతి వస్తువు అమూల్యమైనదే స్త్రీకి. "కొత్త చీర తమ్ముడు తెచ్చినదేమో" అనే వాక్యంలో పుట్టింటిపై ఉన్న అనుబంధాన్ని కవయిత్రి అద్భుతంగా వ్యక్తపరిచారు. మరణంతో పోరాడి తిరిగి బ్రతకాలని ఎవరైనా కోరుకోకుండా ఉంటారా?.

అక్కడ కొందరు

"కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నారు. అవి నిజమైన కన్నీళ్లు కావచ్చు లేదా నటన కావచ్చు. కానీ నా కోసం వారు చిందించే ప్రతి కన్నీటికి నేను ఋణపడి ఉన్నట్లు నాకు అనిపిస్తుందేమో" ఆమెకు.

జీవితంలో ఎదురైన కష్టాలు ఏమీ తనకు ఇప్పుడు గుర్తుకు రాకపోవచ్చు. తను జీవితంలో కోరుకున్న ప్రేమ, వాత్సల్యం ఇప్పుడు అందుకుంటున్నందుకు ఆమె మనసుకు కాస్త ఓదార్పు అంది ఉంటుంది ఈ శవయాత్రలో.

ఆమె జీవితం కాస్త తృప్తిపడింది అంటే అది జీవిత చరమాంకంలో జరిగే తుది ఘటంలోనే అనిపిస్తుంది.

కవయిత్రి పరకాయ ప్రవేశం చేసి ఈ కవిత్వం రాసివుంటారు అనిపిస్తుంది.

ఎన్నో వాస్తవాలను తనలో నింపుకున్న ఈ కవిత "కవనగర్భరాలు" కవితా సంకలనం నందు స్థానం కల్పించడం సంపాదకుల సముచిత నిర్ణయం అనిపిస్తుంది

కవనగర్భరాలు కవితా సంకలనం నందు తన కవితకు స్థానం దక్కడం అదృష్టంగా కవయిత్రి భావిస్తున్నారు అనుకుంటూ, వారికి నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ, నా మనోభావాలతో ఈ చిరు స్పందన.



-రాము కోలా
9849001201

## గృహ దేవతలు

కుటుంబ చక్ర గమనానికి..
నాన్న ఎండలో మారిపోతాడు
అమ్మ పొయ్యి..
మంటలకు కమిలిపోతుంది !

నాన్న శ్రమ స్వేదమే..
సంసార ప్రగతి రథ ఇంధనం
అమ్మ చేతి వంట..
అమృతంకలిపిన ప్రసాదం !

నాన్న కాయకష్టంతో కట్టిన ఇల్లు..
నాది అంటాడు కన్న బిడ్డ

పిల్లలు నిర్మించిన గృహాన్ని..
నాది అనడానికి ధైర్యం చేయడు నాన్న !

అమ్మనాన్న తినిపిస్తారు..
కొసిరి కొసిరి కన్నబిడ్డల కడుపు నిండా
వృద్ధాప్యంలో తల్లితండ్రులు..
కొడుకు కోడలి దయపై ఆధారపడతారు.!
అత్తమామల్ని నిర్లక్ష్యం..

చేస్తుంది కోడలు పిల్ల
తన అమ్మానాన్నల్ని మాత్రం..
అన్న వదిన బాగా చూడాలని ఆశ పడుద్ది!

అమ్మనాన్నల తపన..
అవిశ్రాంత జీవన పోరాటం..
అర్థం జీర్ణం కావడానికి..
తండ్రి కావాలి నేటి కొడుకు !



- మధుపాళీ
9949700037

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



ఊహలకే రెక్కలు వస్తే
విహంగమై ఆకాశపు అంచులు
తాకాలని ఉంది
ఊహల ఊయలలో
పచ్చని పచ్చిక బయళ్ళలో
గెంతులు వేసే
జింక పిల్లని నేనవ్వాలని
అందమైన లోకం ఒకటి
అసూయా ద్వేషాలే ఉండవు అక్కడ
కుల మతాల కుమ్ము లాటలు
ఉండని
లోకమది కక్షలంటే తెలియవు
ఆవేశ కావేషాలు ఉండవక్కడ
మనిషి సృష్టించిన డబ్బుకు
అసలే చోటుండదు
ఉన్నదంతా ప్రేమే లే
ఆడుతూ పాడుతూ
తిరిగే లోకమదే లే
ఊహల ఊయలలో

### అందమైన ప్రపంచం

అందమైన లోకమది
గున్న ఏనుగుల చిట్టి ఎలుకల
అల్లరి ఆటలు
తాబేలు కుందేళ్ల పరుగు
పందేలు
కొండలు కోనలు అందమైన
పూల వనాలు
పూల పై వాలే రంగులద్దిన
సీతా కోక చిలుకలు తుమ్మెద
ఝుంకార నాదలు కోయిలమ్మ
గానాలు వెన్నెల జలపాతాలు
పచ్చని ప్రకృతి వడిలో పండిన
పళ్ళు దుంపలే ఆహారం
సాగే సెలయేరులో తీయని నీరే
ఆహార్యం
నా ఊహల ఊయల లో ఊరేగే
అందమైన ప్రపంచం.

-అడ్డా సత్యవేణి. "సత్య"
తణుకు

### జిగిబిగి అల్లికలో

ఆశలకు రెక్కలు తొడిగి ఊహాలపల్లకిలో ఊరేగాలని
అందరాని ఆ నీలి గగనానికి నిచ్చెనలేసి
అంతరిక్షపు అంచులేవో శోధించాలని
ఆనందపు అంబరాలు చుంబించాలని
ఆకాశగంగలో అలుపెరుగక మునకలేయాలని
కడలి అగాధపు లోతులను సాధించాలని
పగడపు ప్రవాళాపు దీవులను వెదికి తీరాలని
ఆణిముత్యపు రాశులను అరచేతి పిడికిళ్ళతో అందుకోవాలని
వెదికి వెదికి పవిత్ర శంఖం చేబూని శంఖధ్వానాలు గావించి
ఓంకార నాదమై రవళించాలని
సొరచేపలను లొంగదీసుకొని
స్వారీలను చేయాలని
సాగరసంగమానికై వడివడి బిరబిర ఉరకలెత్తు నదీకన్యకల
సోయగాలను కనులారా తిలకించాలని
అపార నిధి,నిక్షేపాల, జీవవైవిధ్య ప్రక్షిప్తమై,అలరారు అంబుధిలో
అచ్చెరువు గొలిపేటి మత్స్యకన్నెయ నేనై కొలువుండాలని
ఏవో,ఏవోవో అల్లిబిల్లి ఊహాల జిగిబిగి అల్లికలు నాలో..

-మక్కువ.అరుణకుమారి
విజయనగరం

### ఊహలు గుసగుసలాడె!

అటుచూడుమో సఖా! అందమైన ప్రణయ ప్రకృతిలో మనమిద్దరే.
ఏకాంతాన్ని భంగం చేయకుండా ఆస్వాదించడానికి గాలి పరిమళాలను మోసుకొస్తూంది.
నిండు పున్నమి వెలుగులో మల్లెల వాన కురుస్తున్నట్లు..
మత్తుగా గమ్మత్తుగా వీస్తున్న గాలి సందిట చేర్చుకోమన్నట్లున్న మురళీనాదం.
నిశ్శబ్దంగా నిద్రించిన మన వలపుల ఊహాలకు రెక్కలు వచ్చేస్తున్నాయి.
కదలిక లేని కవితాకల్పనలు కమనీయ రూపం దాలుస్తున్నాయి.
నువ్వు నా పక్కనుంటే చాలు ప్రపంచమే మరిచిపోతాను.
ముగ్ధమనోహర రూపాన్ని మనసార చూస్తూ మైమరచిపోతాను.
కమ్మని కబుర్లు చెబుతూ కవితాకన్యకనై ప్రణయారాధనలో తేలిపోతాను.
నీ ప్రేమకు దాసోహమై అనుక్షణం కౌగిట్లో కరిగి మధురిమలందుకుంటాను.
నీ వెచ్చని శ్వాస చెప్పే కబుర్లు ప్రణయానికి ప్రాణం నిలిపినట్లు.
కోవెలలోని కొలను సుందరపద్మం వికసించగా నీటిలో నీ మోము చూస్తున్నట్లు.
జీవితమంతా నీ ఒడిలో ఊహల ఊయలలోనే తేలియాడుతున్నట్లు..
నీ ప్రేమలో కరిగిపోయి ఊహలపల్లకినెక్కి మౌనంగా నీ పేరును తలచుకోవాలని..
నీ కనులలోని చిరునవ్వు మదిలో మెదలగా నీ స్వరం వినాలని...
కలలు ఊహలు కలవరింతలు శాశ్వతం చేసుకోవడానికి నిరీక్షిస్తూ
ఆత్మీయత పల్లవించగా మదిలోని ఆశల తలుపు తడుతోంది ప్రియా!.

-పద్మ చిగురాల.
హైదరాబాద్.

### చిన్ని కోరిక

ఊహల ఊయలలో
ఊరేగుతూ పల్లకిలో
స్వప్న లోకంలో
విహరించే మనసుకు
ఎన్నెన్ని ఆశలు
విశాలమైన వెన్నెల
వన్నెల గగన వీధిలో
జలతారు నెలవంకను
ఊయల చేసుకొని
అందమైన కలల కంటూ...
ఊగాలని చిన్ని కోరిక!!.
అనంత దూరంలో ఉన్నా
నిండు జాబిలి
హృదయ సీమలోలో
చోటు దక్కితే నెచ్చెలినై.....
పక్కనే తళుక్కుమంటూ
మెరిసే తారజువ్వనై
జన్మ జన్మలకు
తోడుగా నివాలని
సరదాగా సరాగాల
పాటల పల్లకిలో
పాటల సవ్వడి చేయాలని
చిన్ని కోరిక!!.
నాలో నిండిన చీకటనే ....
చింతను బాపే
వెన్నెల నీవైతే
ఆ చల్లని వెన్నెల్లో
కొలనులో జలకాలాడే
కలువభామ నేనై
ప్రతి క్షణం....
హాయిగా ఆడుతూ
పాడుతూ ఉండాలనిలని
జీవితాన ఆనందం
నిండాలని చిన్ని కోరిక!!.

-మద్దెల సరోజన

# కవిత్వం మనిషిని కదిలించాలి-డా.ఏనుగు నరసింహా రెడ్డి





పుస్తకావిష్కరణలో అతిథులు

కవికి ఒక లక్ష్యం ఉండాలని, కవిత్వం మనిషిని కదిలించాలని సమాజంలో మార్పులు కోరేదిగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఏప్రిల్ 25,శనివారం రోజున మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. పుస్తక ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన సింగిడి కవితా సంకలనం చమక్కులు మినీ కవితల సంకలనం మరియు శ్రీమతి చందుబట్ల ప్రమీలాదేవి రచించిన ప్రమీలా చైతన్య కాంతులు కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు కోరే కవిత్వం రావాలని సమకాలీన అంశాలపై కవి మాత్రవే స్పందించగలడని అన్నారు. ఏడు దినోత్సవాలపై కవితా సంకలనం తీసుకురావాలన్న ఆలోచన కలగడమే గొప్ప విషయమని తెలిపారు.కవిగా పేరు సంపాదించుకోవడం కోసం కవిత్వం రాయడం సరైనది కాదని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు మాట్లాడుతూ మార్చ్ 21న ఉన్న ఏడు దినోత్సవాలపై సేకరించిన కవితలు చక్కని విశ్లేషణాత్మక భావాలతో, దినోత్సవాల ప్రాముఖ్యతలను వివరిస్తూ,మన బాధ్యతలను గుర్తుచేస్తూ ఉన్నాయని ఇలాంటి సంకలనం ప్రచురించిన వైరాగ్యం ప్రభాకర్ సాహిత్య సేవలు అభినందనీయమని అన్నారు. సింగిడి పుస్తకం పై కాంచనపల్లి గోవర్ధన్ రాజు సమీక్ష చేయగా చమక్కులు మినీ కవితల సంకలనం పై బ్రహ్మశ్రీ పాణ్యం దత్త శర్మ ప్రమీలా చైతన్య కాంతులు పుస్తకంపై శ్రీమతి సత్యవీణ మొండ్రేటి సమీక్షించారు. కె.వి గోపాలచార్య సభకు ఆహ్వానించగా, కార్యక్రమంలో పద్యమౌళి డాక్టర్ రాధాశ్రీ మూడు పుస్తకాలపై ఉపన్యసించారు. కార్యక్రమంలో 50 మంది కవులచే కవి సమ్మేళనం నిర్వహించి వారిని ఘనంగా సత్కరించడం జరిగింది.

# బీసీ ఉద్యమానికి టార్చ్‌లైట్ - టి. చిరంజీవులు



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి చైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

బీసీ ఉద్యమానికి, బీసీ చైతన్యానికి ఈ పుస్తకం ఒక టార్చ్ లైట్, మార్గదర్శి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో 1996లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారు, ఇన్నయ్య, వి. ప్రకాష్ తదితరులు తెలంగాణకు అనేక రంగాల్లో జరిగిన అన్యాయాన్ని గణాంకాల సేకరించి వివరించారు. అది ఉద్యమానికి, భావవ్యాప్తికి మూలమైంది. ఇప్పుడీ పుస్తకం అంతకన్నా వివరంగా తెలంగాణ రాష్ట్రంలో సమస్త రంగాల్లో కొనసాగుతున్న అసమానతలను, వివక్షను, బీసీల వెనుకబాటుతనాన్ని లెక్కలతో సహా ముందుకు తెచ్చింది. రిటైర్డ్ ఐఏఎస్ ఉన్నతాధికారి చిరంజీవులు ఈ పుస్తకాన్ని ఒక పాఠ్య ప్రణాళికగా రూపొందించారు. అనేక సోర్స్ ల నుండి ఇందులోని సమాచారం డేటా సేకరించడం ఎన్నో వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఒక ఉన్నత అధికారిగా, అనుభవజ్ఞుడిగా ఉన్న అనుభవాలతో వాటిని సేకరించి, సాధికారికంగా మనముందుంచారు.

## ఈ పుస్తకంతో బీసీ ఉద్యమంలో ఒక నూతన మలుపు

ఇంతదాకా జరుగుతూ వస్తున్న బీసీ ఉద్యమం ఒక తీరు. ఈ పుస్తకం ద్వారా ఆ ఉద్యమం మలుపు తిరుగుతున్నది. ఇకనుంచి బీసీ ఉద్యమం కేవలం సైద్ధాంతిక స్థాయితో ఆగిపోకుండా, ప్రతి రంగంలో జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసి, తమ వాటాను ఎలా సాధించుకోవాలో ముందుకు తెస్తున్నది. మా తరానికి 1985 నుండి దశాబ్దాలుగా సైద్ధాంతిక పోరాటం చేసి బీసీ దృక్పథానికి కమిట్‌మెంటును, నిర్మాణాలను, సాహిత్యాన్ని, సంస్కృతిని నిర్మించడానికి సరిపోయింది. ఆ కృషి పునాదులమీద ఇవాళ రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా బీసీ ఉద్యమ నినాదాలు 42 శాతం బీసీల రిజర్వేషన్లు, చట్టసభలతో సహా అన్ని రంగాల్లో 42 శాతం వాటా రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం కోసం ముందుకు సాగుతున్నది. అందుకు ఈ పుస్తకం వివరాలను అందిస్తున్నది. తిరుగులేని వివరాలు ఒక ధైర్యాన్ని, స్థైర్యాన్ని అందిస్తుంది.

గడిచిన బీసీ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలి...

1992లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ఆవిర్భవించింది. దానికి కన్వీనర్‌గా, వ్యవస్థాపక అధ్యక్షులుగా రాష్ట్రమంతటా ఉద్యమాన్ని విస్తరింపజేస్తూ వచ్చాను. 'దళిత రచయితల, కవుల, మేధావుల ఐక్యవేదిక' కృషి సాహిత్య, సామాజిక, సైద్ధాంతిక రంగాల్లో బలమైన పునాది వేసింది. అలా వామపక్ష సాంప్రదాయక రకరకాల సిద్ధాంతాల నుండి ఒక ప్రత్యేక జీవన సిద్ధాంతంగా బీసీ బహుజన సిద్ధాంతాన్ని, సాహిత్యాన్ని సృష్టించుకుంటూ వచ్చింది. అలా ఇప్పటిదాకా వేలాది ప్రసంగాలు, పాటలు, కథలు, నవలలు, సిద్ధాంత వ్యాసాలు వెలువడ్డాయి. వాటన్నిటికీ శిఖరాయమానంగా ఈ పుస్తకం సమగ్ర వివరాలను అందిస్తున్నది. గతం నుండి చేస్తున్న పోరాటాలకు ఇందులోని వివరాలు గొప్ప మద్దతును సమకూర్చాయి.

## బీసీ ఉద్యమంలో నూతన నాయకత్వం ఎదగాలి

బీసీ సామాజిక ఉద్యమం ఎంతగా ఎదిగితే రాజకీయ నాయకులు అంతగా ప్రభావితమై ముందుకు వస్తారు. అందువల్ల ఉద్యమమే మౌలికమైనది. అది సామాజిక ఉద్యమమైనా, రాజకీయ ఉద్యమమైనా బలప్రదర్శనకే ప్రాధాన్యత. లక్షలాది మందిని సమీకరించి బలప్రదర్శన చేసినప్పుడే ఉద్యమానికి ఒక గుర్తింపు వస్తుంది. అలా నిర్మాణం చేసిన నాయకత్వాన్ని మాస్ లీడర్స్‌గా, ప్రజా నాయకులుగా సమాజం, ప్రజలు గుర్తిస్తారు, గౌరవిస్తారు. ప్రతి కుల సంఘం లక్షమందిని సమీకరించి సభలు పెట్టగలుగుతున్నది. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ బీసీ ఉద్యమం పేరిట వారంతా కలిస్తే కనీసం 20 లక్షల మందితో మీటింగ్ జయప్రదం చేయవచ్చు. ఆ సమైక్యత, సమైక్య కృషి ఈనాటి అవసరం.

## రాష్ట్ర వ్యాప్తంగా... అసెంబ్లీ నియోజక వర్గాలవారీగా కృషి జరగాలి

ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు లక్షల డెబ్బై ఐదువేలమంది ఓటర్లు సుమారుగా ఉంటారు. సగానికి పైగా బీసీలు, మహిళలే. అందువల్ల ప్రతి ఒక్కరికి ఈ పుస్తకం అందాలంటే ప్రతి నియోజకవర్గంలో 50 వేల కాపీలు ఆ నియోజకవర్గంలో చేరాలి. అందుకు యువతరానికి ముందు శిక్షణ ఇవ్వాలి. ఒక లక్షమందికి శిక్షణ ఇవ్వడం అనేది ఒక లక్ష్యం. ఆ తర్వాత వారు ఒక్కొక్కరు వందమందిని తయారు చేస్తారు. అలా విస్తరించడానికి ఈ పుస్తకం బీసీలకు కరదీపికగా, ఒక వజ్రాయుధంగా ఉపయోగపడుతుంది.

## బీసీలు అభివృద్ధి చెందితే దేశం రెట్టింపు అభివృద్ధి చెందుతుంది

అన్ని రంగాల్లో మనకు రావాల్సిన వాటా, ప్రాతినిధ్యం తీసుకోవడమంటే ఇప్పుడున్న అభివృద్ధిలో సగం ప్రాతినిధ్యం. అనగా ఇప్పటినుండి 50 శాతం ప్రాతినిధ్యం సాధిస్తే, భారతదేశం రెట్టింపు అభివృద్ధి సాధించడం కూడా. ఎదగడం అంటే భారతదేశ అభివృద్ధి రెట్టింపు కావడం అని అర్థం.

52 శాతంగా ఉన్న బీసీలు అన్నిరంగాల్లో 52 శాతం ప్రాతినిధ్యం, అభివృద్ధి సాధించకుండా జరిగే అభివృద్ధి ఈ దేశ ప్రజల అభివృద్ధి కాదు.

అది కొందరి అభివృద్ధి మాత్రమే. అది అందరి అభివృద్ధి కావాలంటే అన్ని రంగాల్లో 50 శాతం బీసీలు, 16 శాతం ఎస్సీలు, 7 శాతం ఎస్టీలు ప్రాతినిధ్యం పొందినప్పుడే అది అందరి అభివృద్ధి. ఇందుకోసం సుదీర్ఘమైన దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగడం అవసరం. ఎంతో విలువైన, సాధికారిక సమాచారాన్ని సేకరించి అందించిన చిరంజీవులు గారికి హృదయపూర్వక అభినందనలు.



ప్రతులకు:
టి. చిరంజీవులు.
ఐఏ ఎస్ రిటైర్డ్.
9866663153.

పుస్తక సమీక్షలు

# "నాయక శతకం"-"నేను నా పల్లె"

## సుదర్శనం వేణుశ్రీ గారి కవిత్వ దర్శనం ..పద్య రచనకు మార్గ దర్శనం



-కందాళై రాఘవాచార్య
8790593638

సుదర్శనం వేణుశ్రీ కవి ఏ సందర్భాన్నైనా ఛందస్సులో ఫ్రేము కట్టేస్తాడు. 2025 లో "నాయక శతకం" 2026 లో "నేను నా పల్లె 1" వ భాగం రచించారు.

నాయక శతకం నేటి వికృత రాజకీయాల అధిష్టాన నాయకుల వైఖరిని చాటుతుంది..108 సీస తేట గీతాల్లో నాయక శతకం దార్శనికం.ప్రతి పద్య మకుటం నాయకుల గుణములు మార్చ నారసింహ

"వేగ రావయ్య భువి పైకి వేడ్క జేయ" అని లోకాన శబ్దిస్తుంది.

మొదటి పద్యం నాటి నాయకులు నిస్వార్ధ పరులని
నేటి నాయకులు స్వార్ధ పరులని కవి ఆవేదన చెందుతాడు.
10 వ పద్యంలో రైతుల భూములను ధరణి ద్వార
భూస్వాములు లాక్కుంటున్నారని ధ్వజమెత్తుతాడు కవి.
20 వ పద్యం తెలంగాణ పోరాట విధానానికి దర్పణం
చివరి 108 వ పద్యంలో "మానవతను మించిన మతము లేదని చెప్పు / కులముకన్నను గుణము
గొప్ప " అని సర్వేజనాః సుఖినభవంతు అంటూ శతకాన్ని లోకహితం చేసారు.



ప్రతులకు : సుదర్శనం వేణుశ్రీ
సెల్:8328067855

తరువాత వీరి " నేను నా పల్లె" 1 భాగము కూడ శతకమే. శతక పద్యాలు జనం నోటికి కంఠ పాఠం అవుతాయి. మన వేమన సుమతీ కుమార దాశరథి శతకాలు మొదలైనవి ఈ తీరుగనే . సీస తేట గీతి పద్యాలతో" నేను నా పల్లె " శతకం మన పల్లెలన్నింటిని దర్శింపజేస్తుంది మొదటి పద్యంలో " నర్సింల పల్లెయే " తన పుట్టినూరు అని కవి జన్మ భూమి ఉనికిని తెలియజేస్తాడు.

మరో పద్యంలో "ఓనమాలు దిద్ద ఓకట్టె పలకయు" అంటూ అప్పటి విద్య ఎలా ప్రారంభమయేదో చెపుతారు

"లోవాకిలి నందు రోలు పెద్దగ నుండు" అంటూ అప్పటి ఇండ్లు ఎలా ఉండేవో కవి చెబుతారు

ఇలా సుదర్శనం వేణుశ్రీ గారు తమ పద్యాలలో సమాజాన్ని దర్శింపజేసారు. వీరి పద్యాలలో శిల్ప చతురత --హృద్య సమాసాలు -భాషా పటిష్టత గూఢార్థములు- సంప్రదాయాలు - చరిత్ర మనకు గోచరమౌతుంటాయి.

ఇంకా వీరి కలం నుండి అనేక రచనలు ప్రతి సంవత్సరం వెలువడుతుండాలి.

# నూరేళ్ల దాంపత్యం



సేవ చేయాలనుకుంటే..
పుణ్య తల్లిదండ్రులకు చేయి..
షరతుల్లో బంధించే ప్రేయసికి కాదు !.
బాధలు భరించినోడికే..
నవ్వుల విలువ తెలుసు
ఒత్తి కాలితేనే వెలుతురు వస్తుంది !.
నడిచే కాళ్లకే బొబ్బలు
ఒళ్ళు వంచితేనే సత్ఫలితాలు
చెమట చిందిస్తేనే ఫలసాయాలు !.
రాత్రి జరిగిన గొడవను..
తెల్లారి మరిచిపోయే దంపతులు
నూరేళ్ల దాంపత్యాన్ని ఆస్వాదిస్తారు !



-మధుపాళీ
9949700037

## నానీలు

పైరు ఎదిగిందా
ఆనందం రైతులకు
శిష్యుడు పైకొస్తే
సంతోషం గురువుకు

బీటలు వారిన నేలలో
ఎక్కడివీ నీళ్ళు?
అవి రైతుల
కన్నీళ్ళు!!

-డా॥అడువాల సుజాత
సెల్: 9989558678

# వేసవి సెలవులు



-డా॥రావి రంగారావు
9247581825

అమరావతి సాహితీ మిత్రులు 2024 జనవరి నుండి నిర్వహిస్తున్న సాహిత్యం వర్క్ షాపులు. ఈ వారం కథా విజేత బి. సుబ్రహ్మణ్యం. వారి కథ "వేసవి సెలవులు " చదవండి.

-సంపాదకులు

రవికి వేసవి సెలవులు ఇచ్చారు.రవి సంతోషంగా బడి నుండి ఇంటికి వచ్చాడు.

పుస్తకాలు హాల్ మధ్యలో పడేసి వచ్చి "అమ్మా!మాకు రేపటినుండి సెలవలు. అమ్మ.సెలవుల్లో ఎక్కడికైనా వెళదాం!"అని అడిగాడు రవి.

"పుస్తకాలు మళ్ళీ హాల్ లో పడేశావా? వాటిని సర్దలేక పోతున్నా" అని విసుక్కుంది రవి తల్లి పద్మ.

"అమ్మా!నేను నా పుస్తకాలు అలమారలో సర్దిపెట్టాను"అంటూ వచ్చింది గీత.

"చూడరా!నీ కంటే చిన్నదైనా అన్ని పనులు సక్రమంగా చేస్తుంది"

"అదేం కాదు. నేను హాల్ లో పడేసా కదా!అందుకే అలా చేసి చెబుతున్నది"అన్నాడు బుంగమూతి పెట్టి చెల్లిని వెక్కిరిస్తూ.

"ఏంటి!ఇంట్లో చాలా గొడవగా ఉంది.ఏమైంది?"అంటూ రాఘవ భోజనానికి వచ్చాడు.

"అప్పుడే ఆఫీసు నుండి వచ్చారా!ఇదుగో మీ సుపుత్రుడు ఎక్కడికో వెళతాడట.తీసుకువెళ్ళండి"

"నాన్నా! పది రోజులు సెలవు పెట్టిన మనం హార్సిలీ హిల్ స్టేషన్ కు వెళ్ళివద్దాం"

"అమ్మో!పది రోజులే.నా ఉద్యోగం గోవిందా"అని భయం నటించాడు రాఘవ.

"నాన్నా!పోనీ తాతయ్య దగ్గరకు వెళతాం.మమ్మల్ని పంపి మీరు వచ్చేయండి.సెలవులు అన్నీ అక్కడే గడిపేద్దాం "అంది శాంతి నాన్న చేయి పట్టుకొని.

"ఆ పల్లెటూరులో ఏముంది? నేను రాను.బోర్ కొడుతుంది" అన్నాడు రవి.

"హిల్ స్టేషన్ కు వెళ్ళేవారు చేతులెత్తండి"రాఘవ అనగానే రవి రెండు చేతులు పైకెత్తాడు.

"తాతయ్య ఊరుకు వెళ్ళేవారు చేతులు పైకెత్తండి" అనగానే మొత్తం ఆరు చేతులు కనపడ్డాయి.

రవి చుట్టూ చూడగ తాతయ్య ఎప్పుడు వచ్చాడో కానీ తన రెండు చేతులు పైకెత్తి కనపడ్డాడు.

"తాతా!నువ్వు ఎప్పుడు వచ్చావు?"

"ఇందాకే వచ్చాను రవి. ఏరా!మా ఊరు వస్తే బోరు కొడు తుందా?ఒకసారి వస్తే కదా తెలిసేది. ఎప్పుడూ ఏదో వంక చెప్పి తప్పించుకుంటున్నావు. నీకన్నా నా మనవరాలే నయం.వస్తానని చెబుతుంది"

"అంటే చెల్లి,అమ్మ,తాత ముగ్గురూ పల్లెటూరికే ఓటు వేశారన్న మాట.నేనొక్కడిని అక్కడికి ఎలా వెళతాను?"

"అలా దిగులు పడకు.హిల్ స్టేషన్ కు నేను తీసుకెళతాలే"తాత అనగానే రవి దగ్గరకు వెళ్ళి"నిజంగానా?ఎప్పుడు వెళదాం!"అని అడిగాడు.

"ఈ సంవత్సరం మా స్నేహితులం అక్కడే కలవాలని నిర్ణయించాం!నాలుగురోజులు సరదాగా గడిపివద్దాం.సరేనా!"

"నేను మాత్రం నానమ్మ వద్దనే ఉంటాను"అని శాంతి అనడం ఆలస్యం "నానమ్మ కూచి"అని రవి గేలిచేశాడు.

సెలవులకు రవి, శాంతి నానమ్మ ఊరు వెళ్ళారు.

అది నగరానికి దూరంగా ఉన్న పల్లెటూరు.అయినా అక్కడ దొరకని వస్తువంటూ లేదు.

రవి క్రికెట్ బ్యాట్, బంతి కొని అక్కడ పిల్లల తో ఆడుకుంటున్నా డు.

శాంతి నానమ్మ తో తిరుగుతూ పొద్దున్నే ముగ్గు లు వేయడం, చెట్లకు నీళ్ళు పెట్టడం, కూరగాయలు,ఆకుకూరలు కోయడం చేస్తున్నది.ఆటలు కూడా నాన్న మ్మతో అష్టా చెమ్మా, చదరంగం తాతతో ఆడుకుంటున్నది.

పొద్దుటే తాటి ముం జెలు, మధ్యాన్నం మామి డి కాయలు రవి, శాంతి తింటున్నారు.

నానమ్మ చేసే వంటలయితే చాలా రుచిగా ఉంటున్నాయి.

సాయంత్రం చల్లగాలికి తాతతో శాంతి,రవి షికారుకు కూడా వెళుతున్నారు.

"నడవడం చాలా ఆరోగ్యకరం.ప్రతిరోజూ మనం వీలైనన్ని అడుగులు వేస్తూనే ఉండాలి.నడక వల్ల చాలా లాభాలు ఉన్నాయి"

"తాతయ్య.మా సిటీ లో అందరూ ఒకచోటకు వెళ్ళి అక్కడ పరిగెత్తుతూ ఉంటారు"

"మనకు అలాంటి అవసరం లేదు.ఇక్కడ అక్కడ ఉన్నంత ట్రాఫిక్ ఉండదు"అన్నాడు తాతయ్య.

దారిలో కొందరు తాతయ్యని పలకరిస్తున్నారు.

"వెంకటరామయ్య గారు.నీ మనవడు,మనవరాలు చాలా బుద్ధిమంతుల్లా ఉన్నారే!"

"మంచి క్రమశిక్షణ గల పిల్లలు"అని పొగుడుతున్నారు.

"బుద్ధి మంతులు అంటే ఏంటి తాతయ్య"అని అడిగింది శాంతి.

"అంటే తెలివి తో పాటు చెప్పిన మాట వినేవాళ్ళు అన్నమాట"

దారిలో మల్లెపూలు కొన్నాడు తాతయ్య.

అవి తెచ్చి నానమ్మ రత్నం కు ఇచ్చాడు .

"మన పెరట్లో మల్లె చెట్టు ఉందిగా!మళ్ళీ ఎందుకు ఈ పూలు కొన్నట్లు?"అడిగాడు రవి.

"మన తోటలో పూలు మంచి వాసన రావడం లేదట.అందుకే కొన్నా"

"బాగుంది సంబరం.మీకు నచ్చక నా పేరెందుకు మధ్యలో" నానమ్మ చేతులు ఊపుతూ.

"సరే గాని మాల కట్టి దేవునికి కొన్ని,అమ్మాయి శాంతికి కొన్ని ఇవ్వు' 'అన్నాడు తాత.ఇచ్చారు.రవి

శాంతి నానమ్మతో వెళ్ళి పూలదండ ఎలా కడుతుందో చూసింది.

తాత,రవి లు నాలుగు రోజులు హిల్ స్టేషన్ కు వెళ్ళివచ్చారు.

సెలవులన్నీ ఇట్టే గడిచిపోయాయి.రవి నాన్న,అమ్మ పిల్లలను తీసుకెళ్ళడానికి పల్లెటూరు వచ్చారు.

"అప్పుడే నెలా పదిహేను రోజులు అయిపోయాయా?వచ్చే దసరా సెలవలకు ఇక్కడికే వస్తా!"అన్నాడు రవి.

"ఎందుకు?తాతయ్యను కాకా పట్టి ఊర్లు పట్టుకొని తిరగడానికా?" అని శాంతి అనగానే"బాగా చెప్పావు" అంది నానమ్మ.

"వచ్చే వేసవి కాలం మనం అరకు వెళదాం. సరేనా!"అన్నాడు వెంకటరా మయ్య.

"నిజంగానా?అయితే వేసవి సెలవలు మళ్ళీ మళ్ళీ రావాలి." అన్నాడు రవి.

ఈసారి తాతతో పాటు అందరూ నవ్వారు.



-బి.సుబ్రహ్మణ్యం
99086 69424

# మా తాతగారు - పోస్ట్‌మానూ!







- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

ఈ రోజు మా తాతగారి గురించి చెబుతున్నాను. చిన్నప్పటి నుండి ఆయనకి పోస్ట్‌మాన్ అంటే ప్రేమ. అందుకు కారణాలు వున్నాయి. పోస్ట్‌మాన్ నా జీవితంలో గొప్ప వార్తల్ని, విశేషాల్ని మోసుకొస్తాడు అని తన నమ్మకం అంట. అలా అనేక సందర్భాల్లో జరిగింది. అవన్నీ కథలు కథలుగా చెబుతుంటారు.

గ్రంథాలయానికి మొదటిసారి వెళ్ళినప్పుడు ఓ మిత్రుడు చెప్పాడంట. మనం ఓ కార్డు రాస్తే మనకు ఉచితంగా బైబిల్స్ మాత్రమే కాదు ఇంకా చాలా పంపిస్తారని. అప్పట్లో కార్డు మూడు నుండి అయిదు పైసలు వుండేదంట. అలాగే ఇంగ్లీష్ పత్రికలు వచ్చేవి. అందులో ఈఖీఇఇ అని చిన్న ప్రకటనలు వచ్చేవి. అవి చదువుకి చెందినవైనా, మచ్చలకు చెందినవైనా సరే. కొన్ని కంపెనీలు ఢిల్లీలో, ఇంకొన్ని బొంబాయిలో వుండేవంట.

అసలు విషయం మా తాతగారి నాన్న చిన్నప్పుడు మా తాతకి ఆరు సంవత్సరాలు వుండగా చనిపోయారు. అప్పుడు వాళ్ళకు నెలకు డెబ్బై అయిదు రూపాయలు మని ఆర్డర్ వచ్చేది. మా తాత గారిది చివరి ఇల్లు. పోస్ట్‌మాన్ అది తెచ్చి ఇస్తూ మా తాతమ్మని మంచినీళ్ళు అడిగి, కాసేపు కూర్చునేవారు. అప్పట్లో మని ఆర్డర్ వచ్చినప్పుడు ఒకటో, అరో డబ్బులు ఇచ్చేవారు. మా తాతమ్మ ఓసారి ఇవ్వబోయింది.

"మీ దగ్గర నేను తీసుకోవటమా? అంతకన్నా పొరపాటు వుంటుందా? నాకు ఇద్దరు ఆడపిల్లలు. జీతం వస్తోంది. అయినా ఇబ్బందులు పడుతున్నాను. పెద్దాయన జనం కోసం పని చేస్తూ చనిపోయారు. ఇంతమందిని డెబ్బై అయిదు రూపాయల్తో ఎలా పెంచుతున్నారో తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. నేను మీకు సహాయం చేయాలి గాని తీసుకుంటే పాపం అవుతుందమ్మా" అనటం మా తాతగారు విన్నారంట.

అంత మంచి మనుషులు అప్పట్లో వుండేవారు. మా తాతగారు పోస్ట్ కార్డు కొనటానికి చుట్టుపక్కల వారికి రకరకాల పనులు చేసి పెట్టేవారంట. అప్పుడు వారు అయిదు పైసలో, పది పైసలో ఇచ్చేవారంట. వాటితో కార్డులు, అప్పుడప్పుడు వారపత్రికలు కొనేవారు. ఇవన్నీ వింటున్నప్పుడు నాకు థ్రిల్లింగ్‌గా వుండేది!

××××××

మా తాతగారు తర్వాత కాలంలో రచయిత అయ్యారు. ఆయన మొదటి జోక్ దీపావళి సంచికలో అచ్చు అయినప్పుడు ఇంత లావు పుస్తకం వచ్చిందంట. అది మా తాతమ్మ చూసి కంగారు పడిపోయింది. మా రెండోతాత ఆ పుస్తకం తీసుకుని స్కూల్ గ్రౌండ్‌లో వున్న మా తాతకి ఇచ్చినప్పుడు ఇద్దరూ గాల్లోకి ఎగిరారంట.

అలాగే తర్వాత కాలంలో మా తాత రాసిన కథలకు బహుమతులు వచ్చినప్పుడు పత్రికల నుండి ఉత్తరాలు వచ్చేవి. అవన్నీ మా తాత దాచుకున్నాడు. మాకు చూపించేవాడు.

"ఇప్పుడు ఉత్తరాలు లేవు, టెలిగ్రాములు లేవు. మెయిల్స్ వచ్చాయి. సెల్‌ఫోన్స్ వచ్చాయి. అప్పట్లో ఓ కథ అచ్చు అయితే కనీసం నాకు ఓ వంద ఉత్తరాలు వచ్చేవి. మాటలు గాల్లో కలిసిపోతాయి. ఉత్తరాలు అలా కాదు మనవడా" అనేవారు.

పోస్ట్‌మాన్ తర్వాత రిటైరైపోయారు.

మా తాత పోస్ట్‌మాన్‌కి అంకితం చేస్తూ ఓ నవల రాశారంట. అది ఓ పోటీకి పంపితే వెనక్కి పంపుతూ 'ఇలాంటి రచనల్ని క్షేమంగా మోసుకొచ్చినందుకు పోస్ట్‌మాన్‌కి అంకితం ఇవ్వాల్సిందే' అని ఓ న్యాయనిర్ణేత వ్యంగ్యంగా రాసి అది తుడిచేయటం మరిచిపోయాడు. మా తాతగారు అప్పుడు ఓ లేఖ రాశారంట.

'అయ్యా? పోస్ట్‌మాన్ నాకు దేవదూత లాంటివాడు. దేవుళ్ళు కూడా అన్యాయం చేస్తుంటారు. చిన్నప్పుడే మా తండ్రిని తీసుకుపోయాడు. ఆ తర్వాత మా జీవితంలో ఆనందాలను తీసుకొచ్చింది ఈ పోస్ట్‌మాన్. వీరి వ్యంగ్యం బాధ కలిగించింది. వారి రచనలు మాత్రం వెనక్కి రావా. రాకపోతే మంచిదే. ఈ తరహా వ్యంగ్యం మంచిది కాదు. ఇకనుండి మీ పోటీలకు రచనలు పంపను" అంటూ.

వెంటనే లేఖ వచ్చింది మా తాతకి వారినుండి.

'మమ్మల్ని క్షమించండి. అతన్ని ఇకనుండి ఏ పోటీలకూ న్యాయ నిర్ణేతగా వుంచటం లేదు. తనని మా సంస్థ నుండి బహిష్కరిస్తున్నాం' అంటూ!

పోస్ట్‌మాన్‌లు మంచి వార్తల్నే తీసుకురారు. అందులో మరణాలు వుంటాయి. ఫెయిల్యూర్స్ వుంటాయి. బతుకు అంటే అదే కదా!

××××××

ఇప్పుడు మా తాతగారు రోజూ ఉత్తరం వచ్చిందా అని ఎదురు చూస్తుంటారు. అందులోనూ నగరంలో వుంటున్నారు. అపార్ట్‌మెంట్స్ పెరిగిపోయాయి. అసలు ఉత్తరాలు రాసేవారు లేరు. అందుకని రోజూ మా తాత కూర్చుని లేఖలు రాస్తుంటారు. తన పిల్లలకి, మనవలూ, మనవరాళ్ళకూ. అవన్నీ పోస్ట్ చేస్తుంటారు. అవన్నీ కేవలం క్షేమ సమాచారం చెప్పటం కోసం కాదు.

గొప్ప లేఖలు. నెహ్రూ ఇందిరా గాంధీకి అద్భుతమైన లేఖలు రాశారు. ప్రపంచంలో ఉత్తరాలది గొప్ప చరిత్ర. ఇప్పుడు అన్య, నేనూ విదూ కలుసుకున్నాం. మా తాతగారి గురించి చెప్పాను.

"ముందు మనం మీ తాతగారి లేఖలను ఓ పుస్తకంగా తీసుకువద్దాం. అది పోస్ట్‌మాన్‌కి డెడికేట్ చేద్దాం" అన్నాడు విదూ.

"మనం చేయవలసింది ఇంకోటుంది. ఇక నుండి ప్రతివారం మీ తాతగారికి ఉత్తరం రాద్దాం. అవి మీ పోస్ట్‌బాక్స్‌లో వేద్దాం. అలాగే మన చిరునామాలు రాస్తే తాతగారు మనకి ఉత్తరాలు రాస్తుంటారు" అంది అన్య.

ఇదీ విషయం. మన అమ్మానాన్నలు ఉత్తరాలు రాయక పోవచ్చు. మనందరం తాతలకు రాద్దాం. ఫ్రెండ్స్‌కి రాద్దాం. చివరికి ఈ ప్రపంచానికి రాద్దాం" అన్నాను.



# తెలుగు సాహిత్యంలో, పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసిన 'చంద్ర'



-మహ్మద్ గౌస్

***తెలంగాణకు చెందిన ప్రముఖ చిత్రకారులు , శిల్పి, కార్టూనిస్టు, కళాదర్శకులు మరియు కథా రచయిత. ఆయన తన ప్రత్యేక శైలి చిత్రలేఖనం, ఇల్లస్ట్రేషన్లతో తెలుగు సాహిత్యంలో, పత్రికా రంగంలో (మయూరి, జ్యోతి, యువ) తనదైన ముద్ర వేశారు. 'చంద్ర' కుంచె పేరుతో ప్రసిద్ధి చెందిన మైదం చంద్రశేఖర్ గారి వర్ధంతి జ్ఞాపకం !***

1960 నుండి దాదాపు 40 ఏళ్ల పాటు చంద్ర వేసిన ముఖచిత్రాలతో వేలాది పుస్తకాలు వెలువడ్డాయి.

చంద్ర గీసిన కార్టూన్లు తొలిసారిగా 1959లో ఆంధ్రపత్రికలో ప్రచురితమయ్యాయి. ఆయన కలం నుంచి జాలువారిన తొలి కథ 'నా సూటుకేసు' 1961లో ఆంధ్రప్రభలో వెలువడింది. ఆపై మూడేళ్లకు 'గడ్డిపూలు' పుస్తకానికి బొమ్మలు గీశారు. చంద్ర చిత్రకళాప్రస్థానంలో కొన్ని వందల సంచికలకు ముఖచిత్రాలు, కొన్ని వేల ఇలస్ట్రేషన్లు, కార్టూన్లు, పెయింటింగ్‌లు, గ్రీటింగ్ కార్డులు వెలువడ్డాయి. విరసం, భూమిక, కథాసాహితీ వంటి ప్రముఖ ప్రజా సాహిత్య, సాంస్కృతిక, హక్కుల సంస్థలకు లోగోలను రూపొందించారు. 'యువ', 'జ్యోత్స్న', 'జ్యోతి', 'రచన' తదితర పత్రికల్లోనూ పనిచేశారు. మరికొన్ని సాహిత్య పత్రికల్లో కొన్నాళ్లు సంపాదకీయ విభాగంలోనూ సేవలందించారు.

బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఆర్టిస్టు కమ్ డిజైనర్‌గా పనిచేశారు. పాఠ్యపుస్తకాల అట్టమీది బొమ్మలు, లే-అవుట్, డిజైనింగ్ రూపకల్పనలో చంద్ర ప్రధాన పాత్ర పోషించారు. 'ఓ అమ్మకథ', 'డిటెక్టివ్ నారద' తదితర సినిమాలకు కళాదర్శకుడిగా పనిచేశారు. మరికొన్ని సినిమాలకు పబ్లిసిటీ డిజైనర్‌గానూ వ్యవహరించారు. దర్శకుడు బీ నరసింగరావు ప్రోత్సాహంతో 'రంగులకల', 'చలిచీమలు', 'అబ్బాయి ప్రేమలోపడ్డాడు' తదితర చిత్రాల్లో నటించారు. 'ఇంద్రధనస్సు', 'వెన్నెలవేట' ధారావాహికలకు దర్శకత్వం వహించారు. చంద్రను ఉమ్మడి ఏపీ ప్రభుత్వం హంస అవార్డు'తో సత్కరించింది. ఏపీ సాంస్కృతిక మండలి 'కళారత్న అవార్డు'ను ప్రదానం చేసింది. 'చంద్ర కార్టూన్లు', 'డస్ట్‌బిన్ కార్టూన్లు' పేరుతో పుస్తకాలు వెలువడ్డాయి. చంద్ర ఆత్మీయులు, స్నేహితులంతా కలిసి 2016లో 'ఒక చంద్రవంక' పేరుతో అభినందన సంచిక ప్రచురించారు

పూర్వ వరంగల్ జిల్లా కేసముద్రం మండలం ధన్నసరి గ్రామానికి చెందిన మైదం రంగయ్య, సోమలక్ష్మి దంపతులకు 1946 ఆగస్టు 28న చంద్ర జన్మించారు. తల్లి ఎడ్లబండిలో వెళ్తున్న క్రమంలో నిండు పున్నమి రోజున జన్మించడంతో ఆయనకు చంద్రశేఖర్గా పేరు పెట్టారు. స్కూల్లో చదివే రోజుల్లో ప్రతి ఆదివారం ఖిలా వరంగల్ వెళ్లి అక్కడి శిల్పాలను చూస్తూ వాటి బొమ్మలు వేయడానికి ప్రయత్నించేవారు. వరంగల్లోని అజంజాహి మిల్లులో తొలుత పనిచేసిన వారి తండ్రి గారు ఆ తర్వాత హైదరాబాద్లోని ఆల్విన్‌లో చేరడంతో కుటుంబం హైదరాబాద్కు మారింది.

నారాయణగూడలోని పల్లాదుర్గయ్య ఇంటి ప్రాంగణంలో దాశరథి, బిరుదురాజు రామరాజు, వట్టికోట తదితర వైతాళికుల స్ఫూర్తి ఛాయలో చంద్ర పెరిగారు. అలాగే సుల్తాన్ బజార్లోని లైబ్రరీ చంద్ర వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది. ఆరు, ఏడు తరగతుల్లోనే శంకర్ వీక్లీ చిత్రలేఖనం పోటీలో పాల్గొని బహుమతులు అందుకున్నారు.

## డాక్టర్ వద్దనుకొని చిత్రకారుడిగా....

బాపు బొమ్మలను చూస్తూ చిత్రాలను వేయడం మొదలుపెట్టిన చంద్ర.. పీయూసీ చదివే రోజుల్లోనే సిటీ ఇన్ ద లైట్ చిత్రం వేసి ఉపాధ్యాయులను ఆశ్చర్యపర్చారు. పీయూసీ పరీక్షల్లో పాసైతే తండ్రి తనను మెడిసిన్ చదివించే అవకాశం ఉండటంతో అన్ని ప్రశ్నలకు సమాధానాలు తెలిసినా రాయకుండా వచ్చేశారు. చిత్రకారుడిగా కావాలనే కృతనిశ్చయంతో హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో బీఏ పూర్తి చేశాక విజయభార్గవిని ప్రేమ వివాహం చేసుకున్నారు.

## సినీరంగంతోనూ అనుబంధం....

చంద్ర గారు పలు నాటకాల్లో నటించారు. చిల్లర దేవుళ్లు చిత్రంతోపాటు మరో బెంగాల్ చిత్రంలోనూ హీరోగా నటించే అవకాశం వచ్చినా నటించలేదు. చిల్లర దేవుళ్లు, చలిచీమలు, తరం మారింది, మంచు పల్లకి, డిటెక్టివ్ నారద తదితర 20 చిత్రాలు, 6 లఘుచిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేశారు. మల్లాది, సూర్యదేవర, యండమూరి వీరేంద్రనాథ్ వంటి రచయితల నవలలు చంద్ర ముఖచిత్రాలతో ఆకట్టుకొనేవి. స్వాతి, ఆంధ్రభూమి వంటి వారపత్రికలకు ఆయన క్రమం తప్పకుండా బొమ్మలు గీసేవారు. ప్రఖ్యాత చిత్రకారుడు బాపు ప్రశంసలను అందుకున్నారు.

దేవదాస్ కనకాల దర్శకత్వం వహించిన చలిచీమలు చిత్రంలో చంద్ర గురువుగా నటించారు. పూరుమ్మడి బ్రతుకులు, చిల్లర దేవుళ్లు, మంచు పల్లకి తదితర సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు. చిల్లర దేవుళ్లు మరియు మా భూమి వంటి ఇతర చిత్రాలకు సాంకేతిక రంగాలలో పనిచేశాడు.

చంద్ర గారి శ్రీమతి ఉపాధ్యాయురాలైన విజయ భార్గవి కూడా అనేక నవలలు రచించారు. వాటిలో 'అనురాగ వంచిత' ఒకటి, దీని ఆధారంగానే తెలుగు చిత్రం 'ఊర్వశి' రూపొందింది.

## చంద్ర కథారచయిత....

చంద్ర గారు కథారచయిత కూడా. దాదాపు 150 కథలు రాశారు. 'బడ్జెట్ జీవితం', 'గడియారం గొల్లుమంది', 'అంజనం', 'చావు', 'చీకటి', 'తలుపులు' కథలున్నాయి. 'బడ్జెట్ కథ'కు యూత్‌టైమ్స్ జాతీయ అవార్డు అందుకున్నారు.వాటిలో '12 కథలు' శీర్షికతో ఒక కథా సంకలనం వెలువరించారు. రచయితగా యర్రంశెట్టి సాయి, పమ్మి వీరభద్రరావులతో కలసి గొలుసు నవల కూడా రాశారు. మిత్రులతో కలసి న్యూ వేవ్ రైటర్స్ పేరుతో 'పోరు' అనే కథాసంకలనం ప్రచురించారు.

## కొన్ని వేల కథలకి చిత్రాలు.....

ఇతను కొన్ని వేల కథలకి చిత్రాలు వేశాడు. ఎన్నో పుస్తకాలకు ముఖచిత్రాలు గీశాడు. వేలకొద్దీ కార్టూనులు గీశాడు. చిత్రకళ మీద వ్యాసాలు, సమీక్షలు, కవితలు, 125కు పైగా కథలు వివిధ పత్రికలలో ప్రచురించాడు.

చంద్ర గారి మొదటి కార్టూను 1959లో ఆంధ్రపత్రికలో, మొదటి కథ 1961లో ఆంధ్రప్రభలో అచ్చయ్యాయి. జ్యోతి, యువ మాసపత్రికలలో ఆర్టిస్టుగా పనిచేశారు. స్వాతి మాసపత్రిక, మయూరి వారపత్రిక, పుస్తక ప్రపంచం మాసపత్రికలలో సంపాదక వర్గంలో పనిచేశారు.20 సినిమాలకు, 6 డాక్యుమెంటరీ చిత్రాలకు కళాదర్శకుడి గా పనిచేశాడు. 2 డాక్యుమెంటరీ చిత్రాలకు దర్శకత్వం వహించాడు. ఇంద్రధనుస్సు, వెన్నెలవేట మొదలైన టి.వి.సీరియల్స్‌కు దర్శకత్వం వహించారు.

చంద్ర', 'బాల' పేర్లతో చిత్రకారునిగా, ఇల్లస్ట్రేటర్‌గా, కార్టూనిస్ట్ గా, డిజైనర్‌గా ప్రసిద్ధి చెందిన మైదం చంద్రశేఖర్ దీర్ఘ కాలిక అనారోగ్యం మరియు కరోనా మహమ్మారి కి గురై సికింద్రాబాద్ మదర్ థెరిసా రీహబిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతూ **28-04-2021**న హైదరాబాదులో తన 75వ యేట మరణించారు.



జనవరి 8, 1985 'ప్రజాకళ' చిత్రకళా సంస్థ ప్రథమ వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రముఖ చిత్రకారులు కార్టూనిస్టు చంద్ర. వేదికపై ప్రధాన కార్యదర్శి బైస దేవదాసు, అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది పి.వి. రాజ్‌గణేశ్.

# గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది..

### -రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి
### -రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

నల్గొండ, ఏప్రిల్ 29: గ్రామాలు బాగుపడితేనే దేశం బాగుపడుతుందని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఇవాళ నారాయణ పేట జిల్లా మక్తల్ మండలం గోలపల్లి నుండి మంథన్ గోడ్ రోడ్డుకు ఒక కోటి యాభై లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన నూతన వంతెన నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మక్తల్ ను ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు.

రోడ్లు పెద్దగా ఉంటేనే గ్రామాలకు గౌరవం పెరుగుతుందన్నారు. రోడ్ల విస్తరణలో ఇండ్లు కోల్పోతే వారికి ఇండ్లుమంజూరు చేస్తామని హామీని చ్చారు. మీ సహకారం ఉంటే గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని మంత్రి సూచించారు. గ్రామాల్లో రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాలు, రాష్ట్రాలు తద్వారా దేశం బాగుపడుతుందని అన్నారు. మక్తల్ ను ఈ రెండున్నర ఏళ్లలో చాలా అభివృద్ధి చేశామన్నారు. గ్రామాలను బాగు చేసుకున్నప్పుడే మనం తెలివిమంతులము అవుతామని అన్నారు.మక్తల్ కు 220 కేవీ సబ్ స్టేషన్ ను త్వరలోనే తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. మక్తల్ లో రోడ్డు విస్తరణకు అడ్డమైతే నా ఇల్లు కూల్చమని ఆదేశించానని గుర్తు మంత్రి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు గోలపల్లి గ్రామ సర్పంచ్ సూర్యకుమార్, మంథన్ గోడ్ గ్రామ సర్పంచ్ రాజేందర్ గౌడ్,మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, మార్కెట్ మాజీ జడ్పీటీసీ జి.లక్ష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభ్యుదయ కవి శ్రీ శ్రీ



ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావుగా లబ్ధ ప్రతిష్టులైన శ్రీశ్రీ (ఏప్రిల్ 30, 1910 – జూన్ 15, 1983). విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వారిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులు గా, సినిమా పాటల రచయితగా ఆయన సుప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది, నాస్తికులు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతా మోదం పొందారు. శ్రీశ్రీ పుట్టిన దినం గురించి, ఫిబ్రవరి 1, 1910 న జన్మించానని ఆయన విశ్వసించినా, పరిశోధకులు కొందరు 1910 ఏప్రిల్ 15న జన్మించారని పేర్కొన్నా, విశాఖపట్నం పురపాలక సంఘం వారు ఖరారు చేసిన తేదీనే 1910 ఏప్రిల్ 30 అని విరసం వారు స్పష్టీకరించారు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఇతను ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో చేసారు. 1925లో ఎస్ ఎస్ ఎల్ సీ వుత్తీర్ణుడు అయినారు. అదే సంవత్సరం వెంకట రమణమ్మను పెళ్ళి చేసుకున్నారు. 1931 లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బియ్యే (జంతు శాస్త్రము) పూర్తి చేసారు.

1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లోను, మిలిటరీ లోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుండి 1940 వరకు ఆయన రాసిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహాప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించారు. తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకం అది.1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటర్ గా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లోను, మిలిటరీ లోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు.

1947లో మద్రాసుకు తిరిగి వచ్చి అక్కడే స్థిరపడ్డారు. తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ మరిన్ని గొప్ప రచనలు చేసారు. ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాసారు. 1949లో ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 1956లో సరోజను రెండవ భార్యగా వివాహమాడారు.

1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరఫున శ్రీశ్రీ చురుగ్గా ప్రచారం నిర్వహించారు. హనుమాన్ జంక్షన్లో ఒక ప్రచార సభలో, ఆయన ఆరోగ్యం దెబ్బతిని, కొన్ని నెలల పాటు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో, శ్రీశ్రీ, వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి, ఖమ్మంలో సమైక్య వాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన జరిపారు.

శ్రీ శ్రీ ఎన్నో పురస్కారాలు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు తదితరాలు. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసారు. 1970లో ఆయన షష్టిపూర్తి ఉత్సవం సందర్భంగానే అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. 18 వ ఏట 1928 లో "ప్రభవ" అనే కావ్య సంపుటిని ప్రచురించారు. 1950 లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవి చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించారు. తెలుగు వారిని ఉర్రూతలూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను అయన రచించారు. అల్లూరి సీతా రామ రాజు సినిమాకు రాసిన "తెలుగు వీర లేవరా.." అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. రెండవ భార్య సరోజతో కలిసి సినిమాలకు మాటలు రాసారు.

తెలుగులో మొట్టమొదటి డబ్బింగ్ సినిమా ఆహుతికి శ్రీ శ్రీ మాటలు పాటలు వ్రాశారు.

బి.విఠలాచార్యతో పరిచయం కలిగిగాక, అయన కన్నడలో తీసిన కన్యాదానం అనే సినిమాను తెలుగు లో కూడా నిర్మించదలచి శ్రీశ్రీని రచయితగా నియమించుకున్నారు. శ్రీ శ్రీ మైసూరులో వుండి ఒక్కరోజులో 12 పాటలు వ్రాశారు. ఇది ప్రపంచ చలనచిత్ర లోకంలో ఒక రికార్డు!

మనసున మనసై (డాక్టర్ చక్రవర్తి)

హలో హలో ఓ అమ్మాయి (ఇద్దరు మిత్రులు) నా హృదయంలో నిదురించే చెలి (ఆరాధన)

తెలుగువీర లేవరా (అల్లూరి సీతారామరాజు) పాడవోయి భారతీయుడా (వెలుగు నీడలు) శ్రీ శ్రీ గీతాలలో కలికి తురాయిలు.

తెలుగే మన జాతీయ భాష కావాలనేది తన అభిమతం అన్నారు. ఇది భాషా దురభిమానంతో అంటున్న మాటకాదని, తెలుగు భారతదేశం అంతకీ జాతీయభాష కాగల అర్హత గలదని జె.బి.యస్.హాల్డేన్ అన్నారని, సంస్కృత పదాలను జీర్ణించుకున్న కారణంచేత, అటు ఉత్తరాదివారికీ, ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటి కావడంవల్ల ఇటు దక్షిణాది వారికీ, తెలుగు నేర్చుకోవడం చాలా సులభమని హాల్డేన్ పండితుని వాదనతో శ్రీ శ్రీ ఏకీభవిస్తున్నా నన్నారు.

ఏప్రిల్ 30... మహాకవి శ్రీ శ్రీ జయంతి



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494




## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ

ధాన్యం
అప్రధాన్యం
వనవాసులలో పాటకు చాలా ఉంటుంది ప్రాధాన్యం.
-యదుగిరి క్రాంతి రామ్మోహన్ రావు,హైదరాబాద్.

మౌనము
ధ్యానము
ప్రతి జీవికి తన్మయత్వం కలిగించును గానము
YLNV ప్రసాద్ రావు, విజయనగరం.

అర్థం
అనర్థం
భేదాలు తెలిస్తే కలగదు ఎపుడూ అపార్థం
-తిరుమల ఆముక్తమాల్యద, చెన్నై

గెలుపు
మలుపు
ఒక్క విజయం ఓటముల బూజు దులుపు.
-పట్నాల ఈశ్వరరావు విజయనగరం



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

## నిద్రపోని అడవి

అడవి నిద్రపోనేపోదు.
కంటికి కనిపించనంత సూక్ష్మంగ
వీచే గాలికి కదలాడుతు.
అనుక్షణం తన
శాఖలను
వృద్ధి చేసుకుంటు విస్తృతంగ
లిప్త కాలం విశ్రాంతిలేకుండ
విస్తరిస్తూనే ఉంటది.
అడవి అంటే కదల లేని
మానులే అనుకుంటావేమో?
పర్యావరణపు సహజ పొదిలి
ప్రాణవాయువుల విసనకర్ర .
ఎనెన్నో జీవరాసులు సంచరిస్తుంటే.
మరెనెన్నో జీవరాసులు విశ్రమిస్తుంటవి
వేసవిలో భానుడి సెగలకు విలవిలలాడే లే
లేతచిగురుటాకులు
నిశ్శబ్దంగ వాడి ముడుచుకుంటాయి.
గ్రీష్మ ఋతువు లో
చిగురులు వేసే మానులు ఎనెన్నో
శిశిర ఋతువుల్లో
ఆకులు రాల్చే మానులు మరెనెన్నో.
పుడమి తల్లి ఎదను ముద్దాడుతు
వనమూలిక సంపద పెంచుతు.
నీటి గలగల చప్పడులు
వేర్ల కొనలపొంటి కోనలపొంటి
జాలువారుతు కొండగుట్టలను
తడుముతు తడుపుతు
లోయల్లోకి దుంకుతు.
వాగులై వంకలై సెలయేరులై.
నదీనదాలై.
భూమి మనుగడకు.
అడవి నిరంతరం శ్రమిస్తూనే ఉంటది.
పచ్చ పచ్చని రంగు కప్పుకుని.
నీలి నీలి నీటి ఊటల జాతర లతో
అడవి నిద్రనే పోదు.

-యరకల యాదయ్య.
9866468979.

## పంచభూత పక్షి

భూమి ఒక రెక్క
ఆకాశమొక రెక్క
సూర్యదేహంతో
నీళ్ళు కాళ్ళుగా చేసుకొని
గాలిని పీల్చుకుంటూ బతుకుతుంది !

- కందుకూరి శ్రీరాములు
9440119245

## కట్టెల పొయ్యి చూడని తరం

మేసే నోటికి గాసం
మండే పొయ్యికి గ్రాసం
పొట్ట తిప్పల కోసం
పొట్టలున్న బతుకుల వేషం!.
కట్టెల పొయ్యి వీరికి కష్టతరం
పొయ్యి ముఖం చూడని తరం
గ్యాస్ పొయ్యి వంట, బఫే లకు
అలవాటు పడిన నవతరం!.
పంట వంట పనులు తెలియవు
పనిమనిషి రాకుంటే ఆగమాగం
సూపర్ మార్కెట్లు షాపింగ్ మాల్స్
క్యాటరింగ్ స్విగ్గీ ఆర్డర్ల భోజనాలు
ఆధునిక జీవనం పరాధీనం !.
మధ్య ప్రాచ్యంలో బాంబుల మంట
గ్యాస్ లేకున్నా కడుపులో
తీరని ఆకవలిమంట
అందని ద్రాక్ష పండ్లు పుల్లనంట !.
కట్టెల పొయ్యి చూడని ఈ తరం
నాజూకు బతుకు తరం
పైస తో పరమాత్మ అంటది
దొరకని సరుకులు గ్యాస్ సిలిం
డర్ తో చతికిల పడి పోతుంది!

-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## తేనెవాక

ఈ రావి చెట్టంతా
తేనె తెట్టులతో
తేనెవాక !!.
తేనె చుక్క ముందు
ఎరువాక వానచుక్క
కొసరంత తీపి కూడా ఉండదు.
అందుకే వానచుక్కలు కురుస్తూ
తేనెను తింటున్నాయి.
తేనటీగల సామూహిక శ్రమశక్తి
కదా-
అందుకే అంత తియ్యన

-కందాళై రాఘవాచార్య
8790593638

## సాహితీ ప్రముఖులకు పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో అతిథులు

హైదరాబాద్, ఏప్రిల్ 29: సాహిత్య కళారంగాలు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నా రెడ్డి అన్నారు.గురువారం రాత్రి ఆర్ఆర్ ఫౌండేషన్, శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో.. త్యాగరాయ గానసభలో యువకళావాహిని అధినేత వై.కే.నాగేశ్వరరావు, ప్రముఖ గాయకుడు వెంకటరావుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం ఎంపిక చేసిన ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. రఫీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ప్రముఖులు కోలేటి దామోదర్, బొప్పన నరసింహారావు, నిర్మలా ప్రభాకర్‌రావు, శరత్ బాబు, శ్యామల, జయారెడ్డి, లంకా లక్ష్మీనారాయణ, కుసుమ భోగరాజు, ఆమని, సుభాష్, కృష్ణ పాల్గొన్నారు

## 'నీ జీవితం నీ చేతిలో' కథా సంపుటి ఆవిష్కరణ



హైదరాబాద్, ఏప్రిల్ 29: ఇంటర్నేషనల్ లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో విజయమాధవి గొల్లపూడి రచించిన 'నీ జీవితం నీ చేతిలో' కథాసంపుటి ఆవిష్కరణ సభ మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్.గోపి ముఖ్య అతిథిగా పాల్గొని నీ జీవితం నీ చేతిలో కథా సంపుటి ఆవిష్కరించారు. అనంతరం యద్దనపూడి సులోచనారాణి-వంశీ లేఖిని ప్రవాస భారతీయ సాహితీ పురస్కారాన్ని రచయిత విజయమాధవికి అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాగసూరి వేణుగోపాల్, జయదేవ్, వంశీ రామరాజు, సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com